విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 3 | సంచిక : 303 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | గురువారం 26 మార్చి 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool


# సృజనాత్మక నగరంగా అమరావతి ఎదగాలి

- ఎకానమీని ప్రోత్సహించేందుకు కంటెంట్ క్రియేషన్ పెద్దఎత్తున జరగాలి
- సృజనాత్మక ఆర్థిక ప్రాజెక్టు ఏర్పాటుకు బాలీవుడ్ స్టార్ సంజయ్‌దత్ ఆసక్తి
- పర్యాటక రంగాభివృద్ధికి సీఎస్ ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి కమిటీ
- పర్యాటకశాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు

## సృజనాత్మక నగరం అంటే?

కళలు, సంస్కృతి, డిజైన్, సంగీతం, సినిమా, ఆహారం.. ఇలా పలు రంగాల్లో ప్రత్యేక గుర్తింపు, వీటిలో ఎప్పటికప్పుడు కొత్త ఆవిష్కరణలు చేసేవే సృజనాత్మక నగరాలు. వీటిని యునెస్కో గుర్తించనుం ది. ఉదాహరణకు ముంబై భారీ సినీ పరిశ్రమగా, చెన్నై కర్ణాటక సంగీతానికి కేంద్రంగా, వారణాసి చేనేతలు, హస్తకళలకు ప్రసిద్ధిగా నిలిచాయి. ఇలాగే రాజధాని అమరావతి ప్రాంతాన్ని వినోద, సమాచార కంటెంట్, ఇతర రంగాల్లో తయారీ కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.



అమరావతి ప్రాంతం సృజనాత్మక నగరం (క్రియేటివ్ సిటీ)గా ఎదగాలని ముఖ్య మంత్రి చంద్రబాబు అన్నారు. క్రియేటివ్ ఎకానమీని ప్రోత్సహించేందుకు వివిధ అంశాల్లో కంటెంట్ క్రియేషన్ పెద్దఎత్తున జరగాలని పేర్కొన్నారు. బాలీవుడ్ స్టార్ సంజయ్‌దత్ కూడా సృజనాత్మక ఆర్థిక ప్రాజెక్టు (క్రియేటివ్ ఎకానమీ) ఏర్పాటుకు ఆసక్తి చూపించారని వివరించారు. ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం పర్యాటకశాఖపై ఆ శాఖ మంత్రి కందుల దుర్గేష్‌తో కలిసి సీఎం సమీక్షించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. 'గోదావరి పుష్కరాల నాటికి రాజమహేంద్రవరం సహా వివిధ ప్రాంతాల్లో 10 వేలకుపైగా హోం స్టేలు రావాలి. వాటి నిర్వహణకు రేటింగ్ పెట్టాలి. వివిధ పర్యాటక ప్రాంతాలు, నగరాల్లో జాతీయ, అంతర్జాతీయ హోటళ్లు వచ్చేలా చూడాలి. అరకు, చింతపల్లి, ముంచంగిపుట్టు, గాంధీవనం, మారేడుమిల్లి తదితర ప్రాంతాల్లో 10-15 కారవాన్ పార్కులు ఏర్పాటుచేయాలి. ఎక్స్‌పీరియన్స్ కేంద్రాల వద్ద కూడా ఈ తరహా ఏర్పాట్లు చేయాలి' అని సీఎం ఆదేశించారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

### విశాఖ, కృష్ణపట్నం పోర్టుల్లో క్రూజ్‌లు

'శ్రీశైలం, గండికోట, కంభంచెరువు లాంటిచోట్ల వాటర్ ఏరోడ్రోమ్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందించాలి. సముద్ర విహారాన్ని ప్రోత్సహించేలా విశాఖ, నెల్లూరులోని కృష్ణపట్నం పోర్టుల నుంచి క్రూజ్‌లు నడిపేలా చూడాలి.

గోదావరి పుష్కరాల నాటికి వెయ్యి టెంట్‌సిటీలు అందుబాటులోకి తేవాలి. కేంద్రం నిర్దేశించిన ఐకానిక్ డెస్టినేషన్ స్కీం కింద విశాఖపట్నం, తిరుపతి నగరాలను అభివృద్ధి చేయాలి.

### విశాఖ, తిరుపతిలో ఎమ్యూజ్‌మెంట్ పార్కులు

విశాఖపట్నం, తిరుపతిలో ఎమ్యూజ్‌మెంట్ పార్కుల ఏర్పాటుకు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలి. ప్రసాద్, స్వదేశ్ దర్శన్ పథకాల్లో వివిధ దేవాలయాలు, దర్శనీయ స్థలాల అభివృద్ధి ప్రాజెక్టులు ఈ ఏడాది మే నాటికి సిద్ధం చేయాలి. రాజమహేంద్రవరంలో గోదావరి పుష్కరఘాట్ పనులు ఆగస్టు, హేవ్‌లాక్ వంతెనపై పర్యాటకులను అనుమతించే పనులు ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తిచేయాలి.

### సూర్యలంక బీచ్‌ను ప్రత్యేకంగా అభివృద్ధి చేయాలి

సూర్యలంక బీచ్‌ను ప్రత్యేకంగా అభివృద్ధి చేయాలి. తిరుపతిలో చెరువులు, అమరావతి ప్రాంతంలో కాలువలు, విశాఖసహా వేర్వేరు ప్రాంతాల సుందరీకరణకు చర్యలు చేపట్టాలి' అని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

- ప్రసాద్, స్వదేశ్ దర్శన్ పథకాల్లో ప్రస్తుతం చేపడుతున్న ప్రాజెక్టులతోపాటు అదనంగా మరో రూ.663 కోట్లకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపామని పర్యాటకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ సీఎంకు వివరించారు. పర్యాటకాభివృద్ధి సంస్థ ఛైర్మన్ నూకసాని బాలాజీ, పలువురు అధికారులు పాల్గొన్నారు.



# విద్యుత్ ఛార్జీలు పెంచట్లేదు

- ట్రూఅప్ భారమూ ప్రజలపై వేయట్లేదు
- అవన్నీ భరించనున్న ప్రభుత్వం
- డిస్కంల రూ.15,790 కోట్ల రెవెన్యూ లోటు తీరుస్తామని లేఖ
- వాణిజ్య వినియోగదారులకు యూనిట్ రూ.12.25 నుంచి రూ.9.95కు తగ్గింపు
- పారిశ్రామిక కేటగిరీలోకి వాటర్ ప్లాంట్లు, ప్రింటింగ్ ప్రెస్‌లు
- 2026-27 టారిఫ్‌ను ఖరారు చేసిన ఏపీఈఆర్‌సీ

విద్యుత్ అదనపు ఛార్జీలు, ట్రూఅప్ భారాలు లేకుండా వివిధ కేటగిరీల వినియోగదారులకు 2026-27 ఆర్థిక సంవత్సరానికి వర్తించే విద్యుత్ టారిఫ్‌ను రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ఖరారు చేసింది. ఏప్రిల్ నుంచి ఇది అమల్లోకి రానుంది. రాష్ట్ర ప్రభుత్వం మొదటి నుంచి చెబుతున్నట్లే ఏ ఒక్క కేటగిరీ వినియోగదారులపై ఛార్జీల భారం వేయకుండా రూపొందించిన టారిఫ్ ఆర్డర్‌ను

- మిగతా2లో

# రాములోరి వైభోగం

## రామతీర్థంపై నాడు నీడ.. నేడు ప్రగతి జాడ

## గిరిప్రదక్షిణ రోడ్డును ప్రారంభించిన పవన్ కల్యాణ్



రాష్ట్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం రామతీర్థం ఒకటి. గొలుసులాంటి రాతికొండల మధ్య శ్రీరాముడు కొలువైన ప్రాచీన దేవాలయమిది. అంతటి విశిష్టత కలిగిన ఈ ఆలయంపై

- మిగతా2లో



# మిత్తల్‌ను రాష్ట్రానికి ఆహ్వానించింది నేనే

- గూగుల్, అదానీలనూ తీసుకొచ్చాను
- అద్దంకి వైకాపా నాయకులతో సమావేశంలో జగన్

మిత్తల్ స్టీల్‌ను తానే తెచ్చినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు బిల్డప్ ఇస్తున్నారని మాజీ ముఖ్యమంత్రి జగన్ విమర్శించారు. అద్దంకి నియోజకవర్గ వైకాపా ప్రజాప్రతినిధులు, నాయకులతో బుధవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. '2022లో నేను

- మిగతా2లో





# 28న శాసనసభ ప్రత్యేక సమావేశం

- అమరావతికి చట్టబద్ధతపై తీర్మానం చేసి కేంద్రానికి పంపేందుకే
- భవిష్యత్తులో న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు
- ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే విభజన చట్టానికి సవరణ

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ రాష్ట్ర విభజన చట్టాన్ని సవరించే ప్రక్రియను ప్రస్తుత పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లోనే పూర్తి చేయనున్నారు. దానికి అవసరమైన లాంఛనాలన్నీ శరవేగంగా

- మిగతా2లో



# పాకిస్థాన్ మాదిరి భారతదేశం 'దళారీగా వ్యవహరించదు'

## అఖిలపక్ష సమావేశంలో జైశంకర్ కీలక వ్యాఖ్య

- ఇరాన్, అమెరికాకు మధ్యవర్తిత్వం వహిస్తున్నట్లు పాకిస్థాన్ వెల్లడి
- అఖిల పక్ష సమావేశంలో మధ్యవర్తిత్వంపై స్పందించిన జైశంకర్
- 1981 నుంచి పాకిస్థాన్‌ను అమెరికా ఉపయోగించుకుంటోందని విమర్శ

పాకిస్థాన్ మాదిరిగా భారతదేశం అమెరికా, ఇరాన్ దేశాల మధ్య మధ్యవర్తిత్వం వహించదని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. గత కొద్దిరోజులుగా పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఇరాన్‌పై

- మిగతా2లో

# మీ ఓటమిని దౌత్య విజయంగా చూపొద్దు..

## అమెరికాకు ఇరాన్ హెచ్చరిక

- తమ క్షిపణులను అడ్డుకోవడంలో అమెరికా విఫలమైందని ఆరోపణ
- ఇజ్రాయెల్‌కు సైనిక మద్దతు వెంటనే నిలిపివేయాలని డిమాండ్
- తప్పుడు ప్రచారం కొనసాగిస్తే తీవ్ర పరిణామాలు తప్పవని వార్నింగ్



పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల నడుమ ఇరాన్, అమెరికాకు తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేసింది. ఇరాన్-ఇజ్రాయెల్ ఘర్షణలో తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు అమెరికా ప్రయత్నిస్తోందని ఇరాన్ సైనిక దళాల ముఖ్య ప్రతినిధి ఆరోపించారు.

- మిగతా2లో



# ఎల్‌పీజీ రీఫిల్ నిబంధనల్లో మార్పులు లేవు..

## బుకింగ్‌పై వదంతులు నమ్మొద్దు: పెట్రోలియం శాఖ

- ఎల్‌పీజీ రీఫిల్ బుకింగ్ నిబంధనలు మార్చారన్న వార్తలను ఖండించిన కేంద్రం
- ప్రస్తుత నిబంధనలే కొనసాగుతాయని పెట్రోలియం శాఖ స్పష్టీకరణ
- దేశవ్యాప్తంగా తగినన్ని గ్యాస్ నిల్వలు ఉన్నాయని భరోసా
- ఆందోళనతో బుకింగ్స్ చేసుకోవద్దని ప్రజలకు ప్రభుత్వ సూచన
- పెట్రోల్, డీజిల్ కొరత లేదని బీపీసీఎల్ ప్రకటన

- మిగతా2లో

# డిమాండ్ల యుద్ధం

- శాంతి చర్చలపై అమెరికా, ఇరాన్ చెరోదారి
- యుద్ధం నిలిపివేతకు 15 పాయింట్ల ప్రణాళికను రూపొందించిన అమెరికా
- పాక్ మధ్యవర్తిత్వంలో చేరవేత
- అది తమకు అంగీకారయోగ్యం కాదన్న ఇరాన్
- బాబ్ ఎల్-మండబ్ జలసంధిపైనా దాడులు చేస్తామని హెచ్చరిక



దుబాయ్: పశ్చిమాసియాలో పరిస్థితులు నానాటికీ మరింత ఉద్రిక్తంగా మారుతున్నాయి. ఇరాన్‌తో చర్చలకు ముందుకొచ్చిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. యుద్ధాన్ని నిలిపివేసేందుకు

- మిగతా2లో

- దేశంలో ఇంధన సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా కేంద్రం చర్యలు
- అమెరికా మినహాయింపుల నేపథ్యంలో రష్యా నుంచి కొనుగోలు చేసిన రిఫైనరీలు
- ఇరాన్ చమురును కూడా కొనుగోలు చేసిన భారత్ రిఫైనరీలు

# రష్యా నుంచి భారత్‌కు 60 మిలియన్ బ్యారెళ్ల చమురు... వచ్చే నెలలో డెలివరీ

భారత చమురు సంస్థలు రష్యా నుంచి సుమారు 60 మిలియన్ బ్యారెళ్ల చమురును కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో మన దేశంలో ఇంధన సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా రష్యా నుంచి చమురును కొనుగోలు చేస్తోంది. ఇది వచ్చే నెలలో

- మిగతా2లో



# విద్యుత్ ఛార్జీలు పెంచట్లేదు

-మొదటిపేజీ తరువాయి
కమిషన్ ప్రకటించింది. డిస్కంలు దాఖలు చేసిన ఆదాయ అవసరాల నివేదిక (ఏఆర్ఆర్)లో రూ.17,508.17 కోట్ల ఆదాయ లోటును ప్రతిపాదించాయి. ఆ లెక్కలు పరిశీలించిన కమిషన్ రూ.15,790.57 కోట్ల ఆదాయ లోటును అనుమతించింది. ఈ మొత్తాన్ని తామే భరిస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం కమిషన్‌కు లేఖ అందించింది. రెవెన్యూ లోటును ప్రభుత్వం భరించకుంటే డిస్కంలు ఛార్జీలు పెంచాల్సి వచ్చేది. టారిఫ్ ఆర్డర్‌తో పాటు 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ట్రూఅప్/ట్రూడౌన్ మొత్తాన్ని కమిషన్ సర్దుబాటు చేసింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ట్రూఅప్ ఛార్జీల కింద రూ.638.68 కోట్లు వసూలుకు డిస్కంలు ప్రతిపాదించాయి. ఆ వివరాలను కర్నూలులోని ఏపీఈఆర్‌సీ కార్యాలయంలో కమిషన్ ఛైర్మన్ పి.వి.ఆర్.రెడ్డి మీడియాకు వెల్లడించారు. 'ప్రభుత్వం బాధ్యతాయుతంగా తీసుకుంటున్న నిర్ణయాల కారణంగా విద్యుత్తు ఛార్జీలు పెరగకపోగా.. కొన్ని కేటగిరీల వారికి విద్యుత్తు ఛార్జీలు తగ్గాయి. ఇది రాష్ట్రంలోని కోట్ల మంది ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుంది' అని పేర్కొన్నారు. విద్యుత్తు రిటైల్ టారిఫ్ ఉత్తర్వుల పుస్తకాన్ని విడుదల చేస్తున్న ఏపీఈఆర్సీ ఛైర్మన్ పి.వి.ఆర్.రెడ్డి.
చిత్రంలో ఏపీఈఆర్సీ టారిఫ్‌ల విభాగం సంయుక్తసంచాలకులు డి.రమణయ్యశెట్టి, కార్యదర్శి పి.కృష్ణ

**వినియోగదారులకు దక్కే ప్రయోజనాలు**

2026–27 ఆర్థిక సంవత్సరంలో ఏ కేటగిరీ వినియోగదారులకూ విద్యుత్ ఛార్జీల పెంపు లేదు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ట్రూఅప్ ఛార్జీల భారం కూడా వినియోగదారులపై పడదు. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని 1.30 కోట్ల మంది గృహ విద్యుత్ వినియోగదారులకు
ప్రయోజనం చేకూరనుంది.

సుమారు 22 లక్షల మంది వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు ఉచిత విద్యుత్ సరఫరా అందుతుంది.

ఎస్సీ, ఎస్టీ, ఇతర బలహీన వర్గాలకు చెందిన సుమారు 22 లక్షల మంది వినియోగదారులకు డీబీటీ కింద ఉచిత విద్యుత్/ విద్యుత్ టారిఫ్‌లో రాయితీ అందుతుంది.

రాష్ట్రంలోని వాణిజ్య కేటగిరీ వినియోగదారులకు యూనిట్ ధరను రూ.12.25 నుంచి రూ.9.95కు తగ్గించింది. దీనివల్ల సుమారు 2 లక్షల మందికి ప్రయోజనం చేకూరనుంది.

కుటీర పరిశ్రమలకు లోడ్ పరిమితి 10 హెచ్‌పీ నుంచి 20 హెచ్‌పీకి పెంపు. దీనివల్ల సుమారు 18 వేల మంది చిన్న పరిశ్రమల యజమానులు విద్యుత్ టారిఫ్‌లో రాయితీ పొందుతారు.

**టారిఫ్ కేటగిరీలో మార్పులివీ..**

సోలార్ మాడ్యూల్స్ తయారీ కంపెనీలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక కేటగిరీ టారిఫ్ ఏర్పాటు.

వాటర్ ప్యూరిఫై చేసే ప్లాంట్లు, ప్రింటింగ్ ప్రెస్‌లను వాణిజ్య కేటగిరీ నుంచి పారిశ్రామిక కేటగిరీ కిందికి మార్పు.

జాతీయ రహదారులపై వీధి దీపాల విద్యుత్‌కు కేటగిరీ–2 (కమర్షియల్) టారిఫ్‌కు బదులు కేటగిరీ–4ఎ టారిఫ్ వర్తింపు.

ఈము పక్షుల పెంపక కేంద్రాలకు (20 హెచ్‌పీకి మించి) వినియోగించే విద్యుత్‌కు సీజనల్ ప్రాసెసింగ్ యూనిట్‌గా పరిగణించి, టారిఫ్ వసూలుకు నిర్ణయం.

కోళ్లఫారాల్లో క్యాప్టివ్ ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్లకు సబ్ మీటర్ ఏర్పాటుకు అనుమతి. యూనిట్‌కు రూ.5.85 చొప్పున టారిఫ్ విధించాలని నిర్ణయం.

**డిస్కంలకు జారీ చేసిన కీలక ఆదేశాలు**

2026–27 ఆర్థిక సంవత్సరానికి అంగీకరించిన సబ్సిడీ మొత్తాన్ని నిర్దేశిత వ్యవధిలో ప్రభుత్వం చెల్లించాలి. ఆలస్యమైతే కేంద్ర మార్గదర్శకాల ప్రకారం వడ్డీతో కలిపి వసూలు చేయాలి.

2024–25, 2025–26 ఆర్థిక సంవత్సరాల్లో డిస్కంలకు చెల్లించాల్సిన సబ్సిడీ మొత్తాన్ని కూడా ప్రభుత్వం పూర్తిగా చెల్లించాలి.

ప్రైవేటు సంస్థల బకాయిలు సాధ్యమైనంత తగ్గించేందుకు వీలుగా డిస్కంలు నిబంధనలు అమలు చేయాలి.

విద్యుత్ ప్రమాదాల నియంత్రణ కోసం రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల్లోని సూచనలు తప్పనిసరిగా అమలు చేయాలి.

# రాములోరి వైభోగం

-మొదటిపేజీ తరువాయి
గత ప్రభుత్వం నిర్లక్ష్యం చూపింది. బోడికొండలోని కోదండ రామాలయంలో 400 ఏళ్ల నాటి శ్రీరాముడి విగ్రహం తలభాగాన్ని 2020 డిసెంబరు 29న గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఆలయ ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు, సందర్శనకు వచ్చిన అప్పటి మాజీ సీఎం చంద్రబాబు, మాజీ మంత్రి అచ్చెన్నాయుడు, కిమిడి కళావెంకటరావులపై కేసు పెట్టారు. ఆలయ విగ్రహ ప్రతిష్ఠకు అశోక్ గజపతిరాజు ఇచ్చిన రూ.లక్ష చెక్కు తీసుకోలేదు. కూటమి అధికారంలోకి వచ్చాక ఈ ఆలయాభివృద్ధిపై ప్రత్యేకదృష్టి సారించింది. రూ.3.40 కోట్లతో నిర్మించిన 3.7 కి.మీ. రామతీర్థం గిరిప్రదక్షిణ మార్గాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు బుధవారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఎమ్మెల్యేలు లోకం నాగమాధవి, పూసపాటి అదితి గజపతిరాజు దీన్ని భక్తులకు అంకితమిచ్చారు.

**పవిత్రతను కాపాడతాం.. సంప్రదాయాలను పరిరక్షిస్తాం**

ఆలయాల అభివృద్ధికి, హిందూధర్మ పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఉప ముఖ్యమంత్రి వపన్ కల్యాణ్ పేర్కొన్నారు. రోడ్డు ప్రారంభోత్సవం అనంతరం ఆయన మాట్లాడారు. ఆలయాల పవిత్రతను కాపాడతామని, దేశ సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షిస్తామన్నారు. గతంలో గిరిప్రదక్షిణకు రాళ్లు, ముళ్లకంపలతో భక్తులు ఇబ్బంది పడేవారన్నారు. భక్తులు చెప్పడంతో అధికారం చేపట్టగానే బాధ్యతను భుజాన వేసుకుని నిర్మించామన్నారు. కూటమి ప్రభుత్వం 20 నెలల్లో రూ.40 కోట్లు వెచ్చించి రాష్ట్రంలోని 22 ప్రధాన ఆలయాలకు రోడ్డు సౌకర్యం కల్పించిందని పవన్ వెల్లడించారు. వైకాపా హయాంలో రాములోరి విగ్రహ ధ్వంసంతో బాధపడిన కోట్లమంది హిందువుల్లో తానొకడిన్నారు. స్వామిని ఈ రూపంలో సేవించుకునే భాగ్యం కలగడం అదృష్టంగా భావిస్తున్నానని ఆయన పేర్కొన్నారు.

# డిమాండ్ల యుద్ధం

-మొదటిపేజీ తరువాయి
15 పాయింట్ల ప్రణాళికను తాజాగా ఆ దేశం ముందుంచారు. అణ్వస్త్ర తయారీ ప్రణాళికలను టెహ్రాన్ ఉపసంహరించుకోవడం, అంతర్జాతీయ ఇంధన రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధిని ఎప్పుడూ తెరిచి ఉంచడం వంటి కీలకాంశాలు అందులో ఉన్నాయి. అయితే ఆ ప్రణాళికను ఇరాన్ తిరస్కరించింది. తమపై ఆంక్షలను పూర్తిగా ఎత్తివేయడం, గల్ఫ్‌లో అమెరికా సైనిక స్థావరాలన్నింటినీ మూసివేయడం వంటి తమ డిమాండ్లను అంగీకరిస్తేనే యుద్ధం ఆపుతామని బదులివ్వడం ద్వారా అగ్రరాజ్యానికి గట్టి షాకిచ్చింది. 15 పాయింట్ల ప్రణాళికను ఇరాన్ తిరస్కరించినప్పటికీ.. చర్చలకు దారులు పూర్తిగా ఏమీ మూసుకుపోలేదని అమెరికా పేర్కొంది. మరోవైపు– ఇరాన్‌పై వైమానిక దాడులను ఇజ్రాయెల్.. గల్ఫ్‌లో పొరుగు దేశాలపై దాడులను ఇరాన్ బుధవారమూ కొనసాగించాయి.

**క్షిపణి, అణ్వాయుధ కార్యక్రమాలే లక్ష్యంగా..**

యుద్ధం నిలిపివేతకు రూపొందించిన 15 పాయింట్ల కాల్పుల విరమణ ప్రణాళికను.. మధ్యవర్తిత్వం జరుపుతామంటూ ముందుకొచ్చిన పాకిస్థాన్ ద్వారా ఇరాన్‌కు ట్రంప్ చేరవేశారు. ఆ ప్రణాళికలోని పూర్తి వివరాలు బహిర్గతం కాలేదు. అయితే ప్రధానంగా ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమాలు, అణ్వాయుధ తయారీ ప్రణాళికలను అడ్డుకోవడమే లక్ష్యంగా దాన్ని తయారుచేసినట్లు తెలుస్తోంది.

**ట్రంప్ ప్రణాళికలో కీలకాంశాలివీ..**

అణ్వస్త్రాల తయారీలో తనకున్న సామర్థ్యాలను ఇరాన్ పరిత్యజించాలి. యురేనియం శుద్ధి ప్రక్రియను ఆపేయాలి. భవిష్యత్తులో అణ్వాయుధాలను తయారుచేయబోమని టెహ్రాన్ హామీ ఇవ్వాలి. ఇప్పటికే 60% శుద్ధిచేసిన సుమారు 450 కిలోల యురేనియాన్ని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఏఈఏ)కు అప్పగించాలి.

నతాంజ్, ఇస్ఫహాన్, ఫోర్డోల్లోని ప్రధాన అణుకేంద్రాలను తొలగించాలి. ఆ ప్రాంతాల్లో తనిఖీల కోసం ఐఏఈఏకు పూర్తిస్థాయి ప్రవేశం కల్పించాలి.

హర్మూజ్ జలసంధిని ఎప్పుడూ తెరిచే ఉంచాలి.

టెహ్రాన్ తన అనుబంధ సాయుధ ముఠాలైన హెజ్‌బొల్లా, హమాస్, ఇరాకీ మిలిషియాలకు నిధులు, ఆయుధాల సరఫరాను నిలిపివేయాలి.

ఇరాన్ తన అమ్ములపొదిలో ఉండే బాలిస్టిక్ క్షిపణుల సంఖ్య, వాటి పరిధిపై పరిమితులు విధించుకోవాలి.

భవిష్యత్తులో క్షిపణులను స్వీయరక్షణ కోసం మాత్రమే ఉపయోగించుకోవాలి.

ఒప్పందంపై చర్చించేందుకు వీలుగా నెల రోజులపాటు కాల్పుల విరమణ పాటించాలి.

పై ప్రతిపాదనలకు అంగీకరిస్తే.. ఇరాన్‌పై అంతర్జాతీయ ఆంక్షలను అమెరికా పూర్తిగా ఎత్తివేస్తుంది. విద్యుదుత్పత్తి వంటి పౌర అణు కార్యక్రమాల్లో టెహ్రాన్‌కు అండగా నిలుస్తుంది. బుషెహర్ ప్లాంట్‌లోనూ విద్యుదుత్పత్తికి సహాయం చేస్తుంది.

**ఇరాన్ ససేమిరా**

ట్రంప్ ప్రణాళిక తమకు అందినట్లు ధ్రువీకరించిన ఇరాన్.. దాన్ని తిరస్కరిస్తున్నట్లు ప్రకటించింది. యుద్ధం ముగించాలని తాము కోరే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమంపై పరిమితి విధించడం వంటి కొన్ని ప్రతిపాదనలు తమకు ఎప్పటికీ అంగీకారయోగ్యం కావని టెహ్రాన్ చెబుతున్నట్లు తెలుస్తోంది.

**టెహ్రాన్ డిమాండ్లు ఇవీ..**

గల్ఫ్ ప్రాంతంలో అమెరికా సైనిక స్థావరాలన్నింటినీ మూసివేయాలి. ప్రస్తుత యుద్ధంలో జరిగిన నష్టానికి ఆర్థిక పరిహారం చెల్లించాలి. హెజ్‌బొల్లాపై దాడులను ఇజ్రాయెల్ నిలిపివేయాలి.

హర్మూజ్ జలసంధిలో ప్రయాణించే నౌకల నుంచి రుసుములు వసూలు చేసుకునేందుకు అనుమతించాలి.

హర్మూజ్ టెహ్రాన్ నియంత్రణలో ఉండేలా ఒక కొత్త విధానాన్ని తీసుకురావాలి. మళ్లీ దాడులకు దిగబోమని స్పష్టమైన హామీలు ఇవ్వాలి.

ఇరాన్‌పై ఉన్న అన్ని ఆంక్షలను ఎత్తివేయాలి.

**సంప్రదింపులు కొనసాగుతున్నాయి: ట్రంప్**

అంతకుముందు– యుద్ధం నిలిపివేతపై ఇరాన్‌తో సంప్రదింపులు కొనసాగుతున్నాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మంగళవారం శ్వేతసౌధంలో మాట్లాడుతూ చెప్పారు. అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో, ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్, తన అల్లుడు జేర్డ్ కుష్నర్ చర్చల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఇరాన్ తరఫున ఎవరు చర్చల్లో పాల్గొంటున్నారో మాత్రం తెలియజేయలేదు. అణ్వాయుధాలను ఎప్పటికీ తయారుచేయకుండా ఉండేందుకు ఇరాన్ అంగీకరించినట్లు కూడా ట్రంప్ పేర్కొనడం గమనార్హం.

హర్మూజ్ జలసంధికి సంబంధించి ఇరాన్ నుంచి తమకు చాలా పెద్ద బహుమతి అందిందంటూ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ఇరాన్ మాకు ఒక బహుమతి ఇచ్చింది. అది చాలా పెద్దది. దాని విలువ అమూల్యం" అని ఆయన పేర్కొన్నారు. బహుమతి అణు సంబంధమైనది కాదని.. చమురు, గ్యాస్‌తో ముడిపడినదని వ్యాఖ్యానించారు. సంబంధిత పూర్తి వివరాలను మాత్రం వెల్లడించలేదు.

పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ బుధవారం సౌదీ క్రౌన్ ప్రిన్స్ మొహమ్మద్ బిన్ సల్మాన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించేందుకు పాక్ చేస్తున్న దౌత్య ప్రయత్నాల గురించి ఆయనకు వివరించారు.

# 28న శాసనసభ ప్రత్యేక సమావేశం

-మొదటిపేజీ తరువాయి
పూర్తిచేస్తున్నారు. ఇందుకోసం రాష్ట్ర శాసనసభ ఈ నెల 28న ప్రత్యేకంగా సమావేశమవుతోంది. రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కేంద్రాన్ని కోరుతూ తీర్మానాన్ని ఆమోదిస్తుంది. దానికిముందు గురువారం మంత్రివర్గ సమావేశంలో ఆ తీర్మానానికి ఆమోదం తెలుపుతారు. శాసనసభలో తీర్మానం ఆమోదించగానే దాన్ని కేంద్ర హోంశాఖకు పంపుతారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చాక... ఏపీ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కేంద్రాన్ని కోరింది. ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. దాంతో ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే బిల్లు పెట్టేందుకు కేంద్రం చర్యలు ప్రారంభించింది. బుధవారం కేంద్ర మంత్రివర్గ సమావేశంలో అమరావతికి చట్టబద్ధత అంశాన్ని టేబుల్ ఐటెంగా తీసుకుని ఆమోదం తెలపాలని, వెంటనే బిల్లు ప్రవేశపెట్టాలని కేంద్రం భావించింది. అమరావతిని రాజధానిగా గుర్తిస్తూ గతంలో అధికారికంగా ం
తీసుకున్న నిర్ణయం వివరాలు పంపాలని రాష్ట్రప్రభుత్వాన్ని కోరింది. సీఎంవో, శాసనసభ నుంచి అధికారులు ఆ వివరాల్ని పరిశీలించారు. కానీ కేంద్రం కోరిన రూపంలో ఆ వివరాలు లేవని గుర్తించారు. ఆ విషయాన్ని పీఎంఓకి తెలియజేయగా... తాజాగా శాసనసభలో తీర్మానం చేసి పంపించాలని సూచించింది. దాంతో రాష్ట్ర ప్రభుత్వం ఆఘమేఘాలపై అసెంబ్లీని సమావేశపరుస్తోంది.

**అధికారంలోకి ఎవరొచ్చినా కదల్చలేని విధంగా..!**

కేంద్ర, రాష్ట్రాల్లో కూటమి ప్రభుత్వం ఉండటంతో ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించాలన్న రాష్ట్ర ప్రజలు, అమరావతి రైతుల ఆకాంక్ష నెరవేరబోతోంది. అమరావతికి భవిష్యత్తులోనూ న్యాయపరమైన చిక్కులేవీ తలెత్తకుండా ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్ర రాజధానిగా అమరావతి చిరస్థాయిగా కొనసాగేలా, భవిష్యత్తులో మళ్లీ జగన్ లాంటి వ్యక్తులు అధికారంలోకి వచ్చినా రాజధానిని అమరావతి నుంచి అంగుళం కూడా కదిపేందుకు వీల్లేని విధంగా చట్టసవరణ చేయబోతున్నారు. విభజన చట్టానికి సవరణ చేసి, అమరావతికి చట్టబద్ధత కల్పిస్తే... భవిష్యత్తులో రాజధానిని ఇక్కడి నుంచి తరలించడం దాదాపు అసాధ్యం. అలాంటి చట్టబద్ధత లేకపోవడం వల్లే జగన్... అమరావతిపై కక్షగట్టి, మూడు రాజధానుల పేరుతో ముక్కలు చేయాలని చూశారు. ఒకవేళ జగన్ లాంటి పాలకులు మళ్లీ అధికారంలోకి వచ్చి చట్టసవరణ చేయాలన్నా... రాష్ట్రంలో ఆ పార్టీ మొత్తం లోక్‌సభ స్థానాలు గెలుచుకుని, ఆ పార్టీ మద్దతుతోనే కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటుచేయగల పరిస్థితి తలెత్తితేనే సాధ్యమవుతుంది. అది దాదాపుగా జరిగే పని కాదు.

## ఎల్‌పీజీ రీఫిల్ నిబంధనల్లో మార్పులు లేవు.. బుకింగ్‌పై వదంతులు నమ్మొద్దు

ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ రీఫిల్ బుకింగ్ గడువును మార్చారంటూ వస్తున్న వార్తలను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఇవి పూర్తిగా నిరాధారమైన, తప్పుదోవ పట్టించే కథనాలని స్పష్టం చేసింది. ఎల్‌పీజీ కనెక్షన్లకు సంబంధించి రీఫిల్ బుకింగ్ నిబంధనల్లో ఎలాంటి మార్పులు చేయలేదని కేంద్ర పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ (MoPNG) బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది.
కొన్ని మీడియా సంస్థలు, సోషల్ మీడియాలో ప్రధాన్ మంత్రి ఉజ్వల యోజన (PMUY) లబ్ధిదారులకు 45 రోజులు, ఇతరులకు 25 నుంచి 35 రోజుల గడువు విధించినట్లు ప్రచారం జరిగింది. ఈ వార్తల్లో ఏమాత్రం నిజం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనల ప్రకారమే రీఫిల్ బుకింగ్ ప్రక్రియ కొనసాగుతుందని వివరించింది. పట్టణ ప్రాంతాల్లో 25 రోజుల తర్వాత, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల తర్వాత వినియోగదారులు మరో సిలిండర్‌ను బుక్ చేసుకోవచ్చు.
ఇలాంటి తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని, అనవసరంగా ఆందోళనతో సిలిండర్లను బుక్ చేసుకోవద్దని ప్రజలకు ప్రభుత్వం సూచించింది. దేశవ్యాప్తంగా సరిపడా ఎల్‌పీజీ నిల్వలు ఉన్నాయని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చింది. దేశంలోని అన్ని రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని, పెట్రోల్, డీజిల్ నిల్వలు కూడా పుష్కలంగా ఉన్నాయని పేర్కొంది. ఇదే సమయంలో పెట్రోల్, డీజిల్ కొరత ఉందన్న వదంతులను భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (BPCL) కూడా ఖండించింది. ఇరాన్ యుద్ధం కారణంగా ఆర్థిక వ్యవస్థపై పడే ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు చమురు, గ్యాస్, సరఫరా వ్యవస్థలపై దృష్టి సారించేందుకు కేంద్రం ఏడు ఉన్నతస్థాయి బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపింది.

## మీ ఓటమిని దౌత్య విజయంగా చూపొద్దు..

-మొదటిపేజీ తరువాయి
ఓటమిని ఒక 'దౌత్యపరమైన ముందడుగు'గా చిత్రీకరించే ప్రయత్నాలను మానుకోవాలని ట్రంప్ కు హితవు పలికారు. ఇరాన్ ప్రయోగించిన క్షిపణులను నిలువరించడంలో అమెరికా విఫలమైందని, ఆ నిస్సహాయతను ఇప్పుడు ప్రపంచం ముందు ఒక విజయంగా ప్రచారం చేసుకోవాలని చూస్తోందని ఆయన విమర్శించారు. తమ దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవడానికి ఎలాంటి కఠిన చర్యలకైనా వెనుకాడబోమని, శత్రువుల ఎత్తుగడలను తిప్పికొట్టే పూర్తి సైనిక సామర్థ్యం తమకు ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరగడానికి అమెరికా జోక్యమే కారణమని ఇరాన్ ఆరోపించింది. ఇజ్రాయెల్‌కు అందిస్తున్న సైనిక సహకారాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేసింది. ఒకవైపు శాంతి చర్చల గురించి మాట్లాడుతూ, మరోవైపు క్షేత్రస్థాయిలో ఇజ్రాయెల్‌ను ప్రోత్సహించే ద్వంద్వ వైఖరిని అమెరికా వీడాలని సూచించింది. ఈ అబద్ధపు ప్రచారాలు ఆపకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఇరాన్ సైనిక ప్రతినిధి హెచ్చరించారు.

## మిత్తల్‌ను రాష్ట్రానికి ఆహ్వానించింది నేనే

-మొదటిపేజీ తరువాయి
దావోస్‌కు వెళ్లినప్పుడు అక్కడ ఇదే మిత్తల్ వాళ్లు నన్ను కలిశారు. కర్నూలులో గ్రీన్ కో ప్రాజెక్టులో రూ.4,800 కోట్లు పెట్టేందుకు, ఎస్ఆర్ స్టీల్‌ను కొని రూ.వెయ్యి కోట్లతో దాన్ని విస్తరించేందుకు నా సమక్షంలోనే ఒప్పందాలు చేసుకున్నారు. అదే సమయంలో ఉక్కు కర్మాగారం పెట్టాలని వారిని రాష్ట్రానికి నేను ఆహ్వానించా. నక్కపల్లిలో వారికి 2,200 ఎకరాలిచ్చేందుకు ఎన్నికల ముందే అడుగులు పడ్డాయి. ఆలోపు ఎన్నికల కోడ్ వచ్చింది. మేం అంతదూరం తెచ్చిన ప్రక్రియను చంద్రబాబు ఇప్పుడు పూర్తిచేసి, తనను చూసే మిత్తల్ వచ్చినట్లు బిల్డప్ ఇస్తున్నారు' అని విమర్శించారు. గూగుల్, అదానీలను తీసుకొచ్చిందీ తానేనని జగన్ తెలిపారు. '13 రాష్ట్రాలతో పోటీపడి నక్కపల్లిలో బల్క్‌డ్రగ్ పార్కును 2023లో తెచ్చాం. దానికి రూ.వెయ్యి కోట్లు ఇచ్చేందుకు కేంద్రమూ ముందుకొచ్చింది. ఈ రెండేళ్లలో చంద్రబాబు అక్కడ ఒక్క అడుగూ ముందుకు పడకుండా చేశారు. వైకాపా హయాంలో చేపట్టిన పోర్టుల్లో రామాయపట్నం 80%, మూలపేట 30%, మచిలీపట్నం 30% పూర్తయితే.. ఈ రెండేళ్లలో వాటి పనులను ముందుకు కదలకుండా చేశారు' అని జగన్ ఆరోపించారు.

**నాయకత్వ పటిమ చూపించేవారికి న్యాయం**

'రాబోయే ఎన్నికలకు అసెంబ్లీలో 175 నుంచి 263కి, లోక్‌సభ సీట్లు 25 నుంచి 38కి పెరగబోతుండటం శుభవార్త. నాయకత్వ పటిమ చూపించేవారందరికీ న్యాయం చేస్తాం' అని జగన్ పేర్కొన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబుపై కంటే అద్దంకిలో మంత్రి గొట్టిపాటి రవికుమార్‌పై ఇంకా తీవ్ర వ్యతిరేకత ఉందని జగన్ వ్యాఖ్యానించారు.


## రష్యా నుంచి భారత్‌కు 60 మిలియన్ బ్యారెళ్ల చమురు... వచ్చే నెలలో డెలివరీ


-మొదటిపేజీ తరువాయి
డెలివరీ కానున్నట్లు బ్లూమ్‌బర్గ్‌లో కథనం వచ్చింది. బ్రెంట్ క్రూడ్ ధర కంటే బ్యారెల్‌కు 5 నుంచి 15 డాలర్లు అధికంగా చెల్లించి భారత రిఫైనరీలు ఈ చమురును బుక్ చేసినట్లు ఈ కథనం పేర్కొంది. ఈ మొత్తం ఫిబ్రవరిలో చేసిన చమురు కొనుగోళ్ల కంటే రెట్టింపు అని వెల్లడించింది. రష్యా చమురుపై ఉన్న ఆంక్షలను ఇటీవల అమెరికా ఎత్తివేసింది. ఈ నేపథ్యంలో తాజా కొనుగోళ్లు జరిగాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నంత కాలం రష్యా చమురుపై ఆంక్షల మినహాయింపును అమెరికా పొడిగించే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. రష్యా నుంచి ఈ చమురు కొనుగోలుకు సంబంధించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇరాన్ చమురుపై ఉన్న ఆంక్షలను కూడా అమెరికా ఎత్తివేయడంతో, ఆ దేశ చమురును కూడా భారత రిఫైనరీలు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది.

## పాకిస్థాన్ మాదిరి భారతదేశం 'దళారీగా వ్యవహరించదు'

-మొదటిపేజీ తరువాయి
ఐదు రోజుల పాటు దాడులను ఆపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. చర్చల అనంతరం తదుపరి నిర్ణయం ఉంటుందని రెండు రోజుల క్రితం వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఇరుదేశాల మధ్య మధ్యవర్తిత్వం వహిస్తున్నట్లు పాకిస్థాన్ ప్రకటించింది. "పాకిస్థాన్ మాదిరి భారతదేశం దళారీగా వ్యవహరించదు" అని జైశంకర్ అఖిలపక్ష సమావేశంలో వ్యాఖ్యానించారని సంబంధిత నాయకులను ఉద్దేశిస్తూ పీటీఐ తన కథనంలో పేర్కొంది. అమెరికా, ఇరాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించడానికి పాకిస్థాన్, టర్కీ సహా పలు దేశాలు ప్రయత్నిస్తున్నాయని వార్తలు వచ్చిన నేపథ్యంలో జైశంకర్ పైవ్యాఖ్యలు చేశారు. 1981 నుంచి అమెరికా పాకిస్థాన్‌ను ఉపయోగించుకుంటోందని, ఈ క్రమంలో మధ్యవర్తిత్వం అంశం కొత్తేమీ కాదని అన్నట్లు ఆ కథనంలో పేర్కొంది. పశ్చిమాసియా సంక్షోభంపై మాట్లాడేందుకు పార్లమెంట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో 'మనది దలాల్ దేశం కాదు' అని వ్యాఖ్యానించారని తెలుస్తోంది. ఈ యుద్ధం ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ప్రభావం చూపుతోందని, దీనికి త్వరగా ముగింపు పలకాలని తనకు ఫోన్ చేసిన ట్రంప్‌కు ప్రధాని మోదీ స్పష్టం చేశారని ఈ సమావేశంలో తెలిపారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలపై ఢిల్లీ మౌనంగా ఉంటోందన్న ప్రతిపక్షాల ఆరోపణలపై కూడా ఆయన స్పందించారు. ఈ అంశంపై మనం ఎప్పటికప్పుడు స్పందిస్తున్నామని తెలియజేశారు. ఖమేనీ మృతిపై ఆలస్యంగా స్పందించారన్న వార్తలను కూడా జైశంకర్ కొట్టిపారేశారు. ఇరాన్ రాయబార కార్యాలయం తెరవగానే విదేశాంగ కార్యదర్శి పర్యటించి సంతాప సందేశం రాశారని గుర్తు చేశారు.

# నవమికి ముందే రాములోరికి గిరి ప్రదక్షిణ సుమమాల






- రామతీర్థంలో నాటి వేదన బాధ, నేడు అభివృద్ధి జాడతో తీరింది.
- రూ. 3.40 కోట్ల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మాణం.
- ఆలయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది.
- రూ.40 కోట్లతో 22 ప్రధాన ఆలయాలకు రోడ్డు వసతి కల్పించాం.
- శ్రీకాళహస్తి గిరి ప్రదక్షిణ మార్గాన్ని అందుబాటు లోకి తీసుకొచ్చాం.
- కోటప్ప కొండ గిరిప్రదక్షిణ మార్గంలో రోడ్డు మంజూరు చేశాం.

**అమరావతి, మార్చి 25:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం గిరి ప్రదక్షిణ మార్గాన్ని వర్చువల్ గా ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్.

ఆలయాల అభివృద్ధికి, హిందూ ధర్మ పరి రక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఆలయాల పవిత్రతను కాపాడటంతోపాటు దేశ సంస్కృతి, సంప్రదాయాలను పరి రక్షిస్తామని హామీ ఇచ్చారు. విజయనగరం జిల్లా నెలిమర్ల నియోజకవర్గంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం గిరి ప్రదక్షిణ మార్గాన్ని బుధవారం వర్చువల్ గా పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. సీతారాముని పేట కూడలి నుంచి నీలాచలం కొండ వరకు రూ.3.40 కోట్ల ఉపాధి హామీ నిధులతో 3.70 కిలో మీటర్ల మేర ఈ రహదారిని నిర్మించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనివాస్, పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పల నాయుడు, శాసనసభ్యులు లోకం మాధవి, పూసపాటి అదితి విజయలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ భారతదేశంలో ఉన్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో రామతీర్థం ఒకటి. ఈ క్షేత్రంలో రామాయణ, మహా భారత కాలం నాటి ఆనవాళ్లు ఉన్నాయి. అంతటి పవిత్రత కలిగిన రామతీర్థం కొండ చుట్టూ భక్తితో ప్రదక్షిణ చేస్తే ముక్తిని పొందుతారన్నది భక్తుల నమ్మిక. అందుకే వైకుంఠ ఏకాదశి, శివరాత్రి పర్వదినాల్లో బోదికొండగా పిలుచుకునే రామతీర్థం గిరి చుట్టూ వేలాది మంది భక్తులు ప్రదక్షిణ చేసి మొక్కులు తీర్చుకుంటారు. రాళ్లు, ముళ్ల కంపలతో భక్తులు ఇబ్బంది పడేవారు, రామతీర్థం గిరి ప్రదక్షిణ మార్గం గతంలో రాళ్లు, రప్పలు, ముళ్ల కంపలతో నిండి ఉండేదన్నారు. గిరి ప్రదక్షిణకు వచ్చే భక్తులు కష్టమైనా ఆ మార్గం లోనే నడిచేవారు. ఈ విషయాన్ని స్థానిక శాసన సభ్యురాలు లోకం మాధవి తోపాటు కొందరు భక్తులు నా దృష్టికి తీసుకువచ్చారు. చంద్రబాబు నాయుడు నాయకత్వం లోని కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఆలయాల పవిత్రతను సంరక్షించే చర్యల్లో భాగంగా రామతీర్థం కొండ చుట్టూ రోడ్డు నిర్మించే బాధ్యతను భుజాన వేసుకున్నాం. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల నుంచి రూ. 3.40 కోట్లు వెచ్చించి గిరిప్రదక్షిణ మార్గంలో బీటీ రోడ్డు నిర్మించాం. అధికారుల సహకారంతో శ్రీరామ నవమికి రెండు రోజుల ముందే రోడ్డును ప్రజలకు అందుబాటు లోకి తీసుకువచ్చాం. 20 నెలల్లో రూ. 40 కోట్లు వెచ్చించాం, కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత ఆలయాల పవిత్రతను కాపాడే చర్యల్లో భాగంగా గడచిన 20 నెలల కాలంలో ఉపాధి హామీ పథకం, పంచాయతీరాజ్, సాస్కి నిధులు రూ. 40 కోట్లకు పైగా వెచ్చించి రాష్ట్ర వ్యాప్తంగా 22 ప్రధాన ఆలయాలకు రోడ్ల సౌకర్యం కల్పించాం అన్నారు. శివరాత్రికి ముందు శ్రీకాళహస్తి గిరి ప్రదక్షిణ మార్గాన్ని భక్తులకు అందుబాటు లోకి తీసుకువచ్చాం. కోటప్పకొండ గిరి ప్రదక్షిణ మార్గంలో రోడ్డు మంజూరు చేశాం. ఈ రోజున రాములవారి భక్తుల కోసం రామతీర్థం గిరి ప్రదక్షిణ రోడ్డుని అందుబాటు లోకి తెచ్చామన్నారు. గత ప్రభుత్వ పాలనలో రాముల వారి విగ్రహానికి శిరచ్ఛేదం వేదన కలిగించింది, గత ప్రభుత్వం హయాంలో ఇదే రామతీర్థం పుణ్యక్షేత్రంలో రాములవారి విగ్రహం శిరచ్ఛేదం చేస్తే కోట్లాది మంది హిందువు భక్తులు బాధకి గురయ్యారు, వారిలో నేనూ ఒకడిని, ఆ ఘటన తీవ్ర వేదన కలిగించిందన్నారు. ఈ రోజున ఆలయానికి గిరి ప్రదక్షిణ మార్గాన్ని సుందరంగా నిర్మించడం ద్వారా స్వామిని ఈ రూపంలో సేవించుకునే భాగ్యం కలగడం అదృష్టంగా భావిస్తున్నాను. సంస్కృతి సంప్రదాయాలను కూటమి ప్రభుత్వం కాపాడుతుంది అన్నారు.

# గోకులం షెడ్డు నిర్మాణ భూమి పూజ కార్యక్రమంలో చింతమనేని దంపతులు





**దెందులూరు, పెన్ సత్తా, మార్చి 25:** నియోజకవర్గంలో పాడి రైతులకు మరింత అండగా నిలిచేందుకు పెదవేగి మండలం దుగ్గిరాల గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నూతనంగా నిర్మించనున్న మెగా గోకులం షెడ్డు (సామాజిక గేదెల షెడ్డు) నిర్మాణ పనులకు బుధవారం ఉదయం ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, రాధా రాణి దంపతులు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతాంగ సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, రైతులకు ధాన్యం సొమ్మును గంటల వ్యాధిలో చెల్లించడంతోపాటు ప్రతి ఏట 20 వేల రూపాయలు పెట్టుబడి సాయం అందిస్తూ వారికి అండగా నిలిచిందని తెలిపారు.

ఏలూరు జిల్లా లోనే అత్యధికంగా 370 మినీ గోకులాలను దెందులూరు నియోజకవర్గంలో నిర్మించడం జరిగిందని, నియోజకవర్గం లోని రైతుల సంక్షేమం పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇది ఒక నిదర్శనమని ఎమ్మెల్యే చింతమనేని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెదవేగి ఎమ్మార్వో భ్రమరాంబ, ఎంపీడీవో నాగేంద్ర, పెదవేగి మండల టిడిపి అధ్యక్షులు ఈడ్పుగంటి అనిల్ సహా పలువురు ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, రైతులు, వివిధ శాఖల అధికారులు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



# జిల్లాలో రెండు దశల్లో జనగణన, గణాంకాల్లో నిబంధనలను పాటించాలి.

**జిల్లా కలెక్టర్, జిల్లా ప్రిన్సిపాల్ సెన్సస్ అధికారి విజయ క్రిష్ణన్.**



**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 25 :** జనాభా లెక్కలు రెండు దశలలో జరుగుతాయని, మొదటి దశలో బ్లాకుల వారీగా గృహాల లెక్కింపు జరుగుతుందని, రెండవ దశ లో జనాభా గణన వచ్చే ఏడాది లో జరుగుతుందని జిల్లా కలెక్టర్, జిల్లా ప్రిన్సిపాల్ సెన్సస్ అధికారి విజయ క్రిష్ణన్ తెలిపారు. బుధవారం అనకాపల్లి పట్టణం స్థానిక గుండాల జంక్షన్ ఎస్.ఆర్.శంకరాన్ ఫంక్షన్ హాల్లో డి.ఆర్వో, జిల్లా జనగణన అధికారి వై.సత్యన్నారాయణ రావు ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయి శిక్షకులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతు గతంలో జనాభా లెక్కింపు కార్యక్రమం మాన్యువల్ గా జరిగేదని, ఈ సారి అంత ఎలెక్ట్రానిక్ విధానం లోనే జరుగుతుందని అన్నారు. మొదటి దశలో గృహాల లెక్కింపు జరుగుతుంది కావునా జనగణన కు సంబంధించి నిబంధనలను, పద్ధతులను పాటిస్తూ తప్పులు జరగకుండా చేపట్టాలని తెలిపారు. తదుపరి ఎన్యూమరేటర్లకు , సూపర్వైజర్ల కు శిక్షణ ఉంటుందని, అన్ని స్థాయిల్లో శిక్షణ సజావుగా జరగాలని అన్నారు.

డి.ఆర్వో, జిల్లా జనగణన అధికారి మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇది 8 వ జనాభా లెక్కింపు కార్యక్రమమని, బ్రిటిష్ కాలం లో మొదటగా 1881 లో జనాభా లెక్కింపు జరిగిందని తెలిపారు. కోవిడ్ కారణంగా అప్పుడు జరగాల్సినవి ఇప్పుడు జరుగుతున్నాయని, ఇక్కడ శిక్షణ పొందిన వారు క్షేత్ర స్థాయి లో శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని అన్నారు.

కార్యక్రమం లో కలెక్టరేట్ సమన్వయ సూపరింటెండెంట్ వి.ఎస్.వాసు నాయుడు, మాస్టర్ ట్రైనర్లు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



# మానికొండలో రైతన్న మీ కోసం కార్యక్రమం

**రైతుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నాం ఎమ్మెల్యే యార్లగడ్డ.**






**ఉంగుటూరు, పెన్ సత్తా, మార్చి 25**: మండలం మానికొండ గ్రామంలో నిర్వహించిన రైతన్న మీ కోసం వారోత్సవాల కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, కృష్ణ జిల్లా టీడీపీ అధ్యక్షులు వీరంకి వెంకట గురుమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామం లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గ్రామంలో రైతుల వద్దకు వెళ్లి కరపత్రాలు అందజేసి, వారి సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. గన్నవరం నియోజకవర్గం నుంచే పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ నిధులను రాష్ట్ర వ్యాప్తంగా సీఎం చంద్రబాబు ప్రారంభించినట్లు గురుమూర్తి తెలిపారు. రైతులకు ఉన్న ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతున్నామని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూడ తెలుగుదేశం పార్టీ స్థాపన తర్వాత ఎప్పుడూ లేని విధంగా మానికొండ గ్రామం భారీ మెజారిటీ ఇచ్చిందని, అందుకే ఈ గ్రామాన్ని ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. మానికొండతరిగొప్పల రోడ్డుతో పాటు ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి మొత్తం రూ.3.45 కోట్లను కేటాయించినట్లు వెల్లడించారు. ఇందులో రూ.2.50 కోట్లతో అధ్వానంగా ఉన్న రహదారిని 10 రోజుల్లో ప్రారంభిస్తామనీ, మరో రూ.95 లక్షలతో నందమూరు రోడ్డును నిర్మిస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే నియోజకవర్గంలో 60 వేల మందికి ఇంటి వద్దే రక్త పరీక్షలు నిర్వహించామని, రైతులకు ఇచ్చే పట్టాదారు పాస్ పుస్తకాలలో లోపాలను సరిచేసి, రాష్ట్ర రాజముద్రతోనే పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గన్నవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గూడవల్లి నరసింహా రావు, ఉంగుటూరు మండల అధ్యక్షులు కొలుసు రవీంద్ర, రాష్ట్ర టిడిపి నాయకులు చిరుమామిళ్ల సూర్యం, దొంతు చిన్నా, మానికొండ గ్రామ టిడిపి అధ్యక్షులు యడ్లపల్లి సాయిబాబు, మానికొండ పిఏసిఎస్ చైర్మన్ అరికట్ల రవి, కుందేటి చంద్రశేఖర్, గొడ్డళ్ల చిన్న రామారావు, బెజవాడ నాగేశ్వర రావు, చింత వాసుబాబు, కొండేటి వెంకటేశ్వరరావు, అరుమళ్ళ కృష్ణారెడ్డి, మేడేపల్లి రమ, తుమ్మల లత, దాసరి రవళి, కొసరాజు సాయి, షేక్ ఫిరోజ్, షేక్ అజీజ్, విష్ణు, పొట్లూరి భువనేశ్వరి, రాజబోయిన శివాజీ, యర్రగుంట్ల వినోద్, కొమ్మారెడ్డి రాజేష్, బోడపాటి రవి, తిరువీధి నరేష్, వేలమర్తి రాజు, లంకా సత్తిరాజు, గుడ్డేటి అనిల్, ఉయ్యూరు మురళి, తోటా నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో గంజాయి, సింథటిక్ డ్రగ్స్, సెమీ సింథటిక్ డ్రగ్స్ రవాణా నిర్మూలన



**విశాఖపట్నం, పెన్ సత్తా, మార్చి 25:**జిల్లా కలెక్టర్ ఎం.ఎన్ హరేంద్ర ప్రసాద్, అడిషనల్ డి.జి.పి, కమీషనర్ ఆఫ్ పోలీస్ డా. శంఖబ్రత బాగ్చి ఆధ్వర్యంలో కలెక్టర్ సమావేశమందిరంలో నార్కోడ్ సమావేశం నిర్వహించడం జరిగినది.

జిల్లాలో గంజాయి, ఇతర సింథటిక్ డ్రగ్స్, సెమీ సింథటిక్ డ్రగ్స్ రవాణా నిర్మూలించడం పై సమావేశం నిర్వహించారు. జిల్లా రెవెన్యూ, పోలీసు, ఎన్.సి.బి, విద్యా, వైద్య కస్టమ్స్, డ్రగ్ ఇన్స్పెక్టర్లు పోర్టు, కస్టమ్స్, ఈగల్ అధికారులు, రోడ్ & ట్రాన్స్పోర్ట్ ఇతర శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. జిల్లా నందు నార్కో, ఇతర సింథటిక్ డ్రగ్స్ రవాణా పూర్తిగా నిర్వీర్యం చేయడం పై చర్చించారు. పాఠశాలలు, కళాశాలల్లో ఈగల్ టీమ్‌లు, ఈగల్ క్లబ్‌ల ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవడం జరిగినది. సీపీ నగరం లోని ఉన్న వ్యసన విముక్తి కేంద్రాలు, డ్రగ్-వ్యసన విముక్తి కేంద్రాల పనితీరు పై, వాటి బలోపేతం పై చర్చించారు. అదే విధంగా నగర రైల్వే స్టేషన్ల వద్ద లగేజీ స్కానింగ్ మిషన్ల ఏర్పాటు, నగరం లోని నిర్మానుష్య ప్రాంతాల వద్ద పొదలు తొలగింపు, తగు లైటింగ్ ఏర్పాటు, అనుమానిత ప్రాంతాలలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు పై చర్చించి తగు కార్యాచరణ రూపొందించడం జరిగినది.


## రహదారుల దుస్థితి పై పరిటాల శ్రీరామ్ స్పందన.

- ధర్మవరం మండల వ్యాప్తంగా దెబ్బతిన్న రోడ్లను వెంటనే పునరుద్ధించండి.
- తక్షణమే పంచాయతీ రాజ్ రోడ్లను నిర్మించండి పరిటాల శ్రీరామ్.



**ధర్మవరం, పెన్ సత్తా, మార్చి 25:** మండలం లో ఏలుకుంట్ల--మారాల, ఏలుకుంట్ల--సిద్ధరాంపురం మామిడి తోటల ప్రాంతంలో రహదారి దుస్థితి పై పత్రికలో వచ్చిన కథనానికి ధర్మవరం టిడిపి ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ స్పందించారు. వీటి పై శ్రీరామ్ ఫోన్ లో పంచాయతీరాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.ఈ పాండు రంగారెడ్డితో మాట్లాడీ రహదారి గురించి చర్చించారు. అనేక సార్లు టిడిపి నేతలు మీ దగ్గరికి వచ్చారని, దీనికి ఆలస్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పంచాయత్ రాజ్ డీ.ఈ మాట్లాడుతూ ఇప్పటికే మారాల- సిద్ధరాంపురం రోడ్ల వర్క్ ఎస్టిమేట్లు వేయించామని, వెంటనే రోడ్లు నిర్మించేందుకు ప్రతిపాదన సిద్ధం చేస్తామని తెలిపారు. వీటితోపాటు మండలంలో పలు రోడ్ల ఎస్టిమేషన్లను సిద్ధం చేశామని, వెంటనే పనులు ప్రారంభిస్తామని పరిటాల శ్రీరామ్ కు తెలియజేశారు.

## జగన్ ను మర్యాద పూర్వకంగా కలిసిన పయిల శ్రీనివాసరావు, పి ఎస్ రాజు





**విజయవాడ, పెన్ సత్తా, మార్చి 25:**తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, మాడుగుల నియోజకవర్గ పరిశీలికులు పయిల శ్రీనివాసరావు, జడ్పీటీసీ పయిల సన్యాసి రాజు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల మాడుగుల నియోజకవర్గ పరిశీలకులు గా నియమించినందుకు శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలుపుతూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పార్టీ పరిస్థితులు, మాడుగుల నియోజకవర్గంలో జరుగుతున్న పార్టీ అభివృద్ధి కార్యక్రమాల, నూతన కమిటీ లు పై చర్చించారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేయడంలో తన వంతు పాత్ర పోషిస్తామని పయిల పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మరింత చేరువ కావాలని వైఎస్ జగన్ సూచించారు.

# సమన్వయంతో పనిచేసి జిల్లాను డ్రగ్స్, గంజాయి రహిత జిల్లాగా మార్చాలి.





డ్రగ్స్, గంజాయి సమాచారం టోల్ ఫ్రీ నంబర్ 1972 కి అందజేయండి.

జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్.

కఠిన చర్యలతో గంజాయి, డ్రగ్స్ నియంత్రణ జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా.

**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 25:** డ్రగ్స్, గంజాయి సమస్యను అరికట్టడంలో అన్ని శాఖలు సమన్వయంతో కలిసి పనిచేసి అనకాపల్లి జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మాదకద్రవ్యాలు, గంజాయి నియంత్రణ చర్యలు, నార్కో కో- ఆర్డినేషన్ సెంటర్ (ఎన్ సి ఓ ఆర్ డి ) అవగాహన కార్యక్రమాలకు సంబంధించి జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ శౌర్యా మాన్ పటేల్, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ల తో కలిసి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా కేంద్ర ఎన్టీఆర్ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్లో డీ-అడిక్షన్ సెంటర్ పూర్తి స్థాయిలో పనిచేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు అక్రమంగా టొబాకో ఉత్పత్తులు సరఫరా చేస్తున్న వారి పై టాక్స్, ఫుడ్ సేఫ్టీ, పోలీస్, ఈగల్, ఇతర శాఖలు కలిసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో గంజాయి లేదా డ్రగ్స్ కి సంబంధించిన ఏవైనా సమాచారం తెలిసినట్లయితే టోల్ ఫ్రీ నంబర్ 1972 కు తెలియ జేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కమిటీ లోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి గంజాయి రవాణాను పూర్తిగా అరికట్టాలని సూచించారు. విద్యా సంస్థ ల్లో ఈగల్ క్లబ్ లను ఏర్పాటు చేసి, విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలని, గంజాయి వినియోగం లేదా విక్రయాల పై వెంటనే సమాచారం అందించాలని చెప్పారు. జిల్లాలో అన్ని విద్యా సంస్థల్లో కేవలం ప్రసంగాలు మాత్రమే కాకుండా డ్రాయింగ్, ఎస్సే రైటింగ్ వంటి కార్యక్రమాలను కూడా నిరంతరం నిర్వహించాలని డిఈఓ, విద్యాసంస్థల యాజమాన్యాలను ఆదేశాలు జారీ చేశారు. రైల్వే స్టేషన్, రైళ్లలో, బస్టాండ్ లలో నిరంతరం గస్తీ నిర్వహించాలని పోలీస్, ఎక్సయిజ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో క్రమం తప్పకుండ నషా ముక్త్ భారత్ కార్యక్రమాలను చేపట్టాలని, ప్రతి హాస్టల్ లలో డ్రగ్స్ మరియు గంజాయి పై అవగహన కల్పించాలని, పోస్టర్ లను ఏర్పాటు చేయాలన్నారు. కళాశాలల్లో నోడల్ అధికారిని నియమించాలని, ప్రతి పాఠశాల, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలు వద్ద ఏదైనా డ్రగ్స్ సంబంధిత సమాచారం ఉన్నచో పోలీస్ శాఖకు లేదా ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు తెలియజేయవచ్చని, వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. డ్రగ్ డిపార్ట్మెంట్కు సంబంధించి, ఎన్ ఆర్ ఎక్స్ డ్రగ్స్ అక్రమ విక్రయాలను పూర్తిగా నియంత్రించేందుకు, ఇలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనే వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆన్లైన్ ద్వారా అక్రమంగా ఎన్ ఆర్ ఎక్స్ మెడిసిన్స్ ఆర్డర్ చేసి విక్రయిస్తున్న మెడికల్ షాపుల పై ప్రత్యేక దృష్టి పెట్టి, తగిన చట్టపర మైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ జిల్లాలో గంజాయి రవాణా నిరోధానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. పోలీస్, ఎక్సైజ్ శాఖలు సమన్వయంతో తనిఖీలు చేపట్టి రోజువారీగా కేసులు నమోదు చేస్తున్నాయని తెలిపారు. జిల్లాలో ప్రధానంగా నర్సీపట్నం మండలం డౌనూరు, వి మాడుగుల మండలం తాడిపర్తి, చిడికాడ మండలం కోనాం, డౌనూరు, కేడిపేట మండలం భీమవరం, దేవరపల్లి మండలం శ్రీరాంపురం ప్రాంతాల్లో శాశ్వత చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, జిల్లా వ్యాప్తంగా 38 వాహన తనిఖీ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైల్వే మార్గాల ద్వారా గంజాయి రవాణా అధికంగా జరుగుతున్నందున, రైల్వేస్టేషన్, రైళ్ల పై ప్రత్యేక నిఘా ఉంచి అనుమానితులను తనిఖీ చేయాలని సూచించారు. ఈ 2025-26 సంవత్సరానికి సంబందించి ఇప్పటి వరకు 158 కేసులు నమోదై, 492 మందిని అరెస్ట్ చేసి, 9,726 కేజీల గంజాయి, 145 వాహనాలను స్వాధీనం చేసుకున్నామని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. సమావేశంలో జిల్లా ఎక్సయిజ్ అధికారి వి.సుధీర్, డి.అర్యో. వై.సత్యన్నారాయణ రావు, జిల్లా రవాణా, ప్రజా రవాణా, వ్యవసాయ, విద్యా, అటవీ, వెనుకబడిన, గిరిజన, సాంఘిక సంక్షేమ శాఖల జిల్లా స్థాయి అధికారులు, అనకాపల్లి ఆర్డీఓ, డిఎస్పీ లు షేక్ అయిషా, ఎం.శ్రావణి, రైల్వే, జి ఆర్ పి, ఈగల్ శాఖల పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

# జీవవైవిధ్య పరి రక్షణ ప్రతి విద్యార్థి బాధ్యత.

- అడవిలో విహరిస్తూ జీవవైవిధ్యం గురించి తెలుసుకోవాలి.
- ఏ జీవి అంతరించినా నష్టం మానవాళికే.
- శీతోష్ణస్థితి వేడెక్కకుండా కృషి చేయాలి.
- జెవి రత్నం, వ్యవస్థాపక కార్యదర్శి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ.









**కర్నూలు, పెన్ సత్తా, మార్చి 25:**జీవవైవిధ్య పరి రక్షణ ప్రతి విద్యార్థి బాధ్యత అని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం పేర్కొన్నారు. బుధవారం ఉదయం కర్నూలు జిల్లా కేంద్రంలోని నగర వనంలో నేషనల్ గ్రీన్ కోర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభాగం జిల్లా సమన్వయ కర్త ఆకుల రాజశేఖర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మనం పీల్చే గాలిలో రెండు శ్వాసల్లో ఆక్సిజన్ లేకుంటే మృత్యువాత పడుతున్నారు. అందుకే మనం అంతా చెట్లు పెంచాలని, ప్రకృతి వనరులను కాపాడుకోవాలి అన్నారు. అందుకే ప్రకృతి కార్యశాలలు నిర్వహించాలని కోరారు. అడవిలో విహరిస్తూ జీవవైవిధ్యం గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉంది అన్నారు. భూమి మీద ఏ జీవి అంతరించినా నష్టం మానవాళికే అని వివరించారు. శీతోష్ణస్థితి వేడెక్కకుండా కృషి చేయాలి అని కోరారు. అనంతరం కర్నూలు జిల్లా సమన్వయ కర్త ఆకుల రాజశేఖర్ మాట్లాడుతూ ప్రకృతి కార్యశాలల అవసరం ఎంతైనా ఉంది అన్నారు. విద్యార్థులకు ప్రకృతి వనరుల పరి రక్షణ ఆవశ్యకత అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుంది అని పేర్కొన్నారు. నగరవనం లో ఉన్న పక్షులు, వాటి కిల కిలా రావాలు విద్యార్థులను బాగా ఆకట్టుకున్నాయి న్నారు. అలాగే బియ్యం పిండి తో ముగ్గులు వేయించడం, ఆ ముగ్గు వేసిన పిండిని చీమలు తీసుకుని వెళ్ళడం, విభిన్న జీవుల మాస్క్ లతో విద్యార్థుల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది అని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ రత్నం పక్షులు, ఇతర జీవులకు, నీరు, ఆహారం పెట్టె పాత్రలూ, గూళ్ళను తయారు చేయడం మీద అవగాహన కల్పించి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా లోని విభిన్న జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు కె వీరేష్ బాబు, హైమవతి, శంకర్ , రంగస్వామి, పుల్లమ రాజు, కె భాస్కర్, మద్దిలేటి నల్లూరు , సుంకన్న, శారద, సిబి వెంకట రమణ రెడ్డి, ఎస్ . నజీమా, ఎన్ భరత్ కుమార్, జి శ్రీనివాసరెడ్డి, పి శివశంకరయ్య, సరస్వతమ్మ, కుమార్ నాయక్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

# ఘనంగా శ్రీరాముని కల్యాణ రాట



**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 25:**గవరపాలెం పెదరామ స్వామి దేవస్థానంలో శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా స్వామివారి కళ్యాణరాట మహోత్సవాన్ని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, మాజీ మంత్రి దాడి వీరభద్ర రావు సతీమణి పద్మావతి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేళతాళాలతో శాస్త్రోక్తంగా రాట మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామనవమి రోజు రామ చంద్రమూర్తి సీతామహాలక్ష్మి వార్ల కళ్యాణం అతి వైభవంగా నిర్వహించ బడుతుందని, అనంతరం 12 గంటల నుండి స్వామివారి భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మళ్ల రాజ, బొడ్డెడ శంకరరావు, కర్రీ శివన్నారాయణ, కొణతాల గోపికృష్ణ, కొణతాల రత్నాజీ, కర్రి చిన్న అప్పల నాయుడు, కర్రీ అప్పాజీ, కోరుబిల్లి ఆరుద్ర, పెధకంశెట్టి శ్రీను, మొల్లేటి నాగేశ్వర రావు, పెంటకోట చిన్న, నోముల లక్ష్మణ్, భక్తులు మహిళలు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

# చిన్న బజార్ ఆలయం వద్ద పెళ్లిరాట మహోత్సవం

**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 25:**మెయిన్ రోడ్ చిన్న బజార్ వద్ద కొలువైన సీతారామ ఆలయం వద్ద బుధవారం శ్రీరామనవమి పెళ్లిరాట మహోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ముందుగా పేళ్లిరాటకు ప్రత్యేక పూజలు చేసి రాటను వేశారు. ఈ నెల 27 న సీతారామ కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ శాశ్వత గౌరవ అధ్యక్షులు కొణతాల జగన్నాధ రావు నాయుడు, అధ్యక్షులు కె నారాయణ రావు మాస్టారు, కార్యదర్శి సిరసపల్లి సూరిబాబు, కోశాధికారి దాసిరెడ్డి వెంకటేశ్వర రావు, అధ్యక్షులు తిమ్మాపాత్రుని వెంకటేష్, కార్యదర్శి సిరసపల్లి రాజు, కోశాధికారి పాముల ప్రసాద్, కన్వీనర్ కుంచా చిన్న, ఉత్సవ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



# భగత్ సింగ్ స్ఫూర్తితో డ్రగ్స్, మత్తు మందులకు వ్యతిరేకంగా పోరాడుదాం

**సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గనిశెట్టి పిలుపు.**





**పరవాడ, పెన్ సత్తా, మార్చి 25:** దేశ స్వతంత్రం కోసం ప్రాణాలర్పించిన భగత్ సింగ్ 95 వ వర్ధంతి సందర్భంగా బుధవారం పరవాడ మండల కేంద్ర మైన మండల పరిషత్ కార్యాలయం జంక్షన్ లో డ్రగ్స్, గంజాయి వ్యతిరేక ర్యాలీ ని ఎస్ఎఫ్ఐ, సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించారు. గంజాయి, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా పోరాడుదాం అని మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాల బారినపడిన యువత, విద్యార్థుల జీవితాలు నాశనమవుతున్నాయన్నారు. తమ బిడ్డల పై కోటి ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులు వీటికి అలవాటు పడ్డ వారి ఆవేదన అంతా ఇంతా కాదన్నారు. ప్రశాంతంగా, ఆహ్లాదకరంగా వుండే ప్రాంతాలు అశాంతికి నిలయాలుగా మారుతున్నాయి. డ్రగ్స్, గంజాయి వ్యాపార మాఫియా తమ అక్రమార్జన కోసం యువత, విద్యార్థుల నిండు జీవితాలను బలి తీసుకుంటున్నాయి గనిశెట్టి అన్నారు. యువత, విద్యార్థుల బంగారు భవిష్యత్తును కాపాడాలని, తల్లిదండ్రుల ఆశలు నెరవేరాలి. ప్రశాంత, ఆహ్లాదకర వాతావరణం ఏరియాల్లో, విద్యాసంస్థల్లో వుండాలని, మత్తు మందులను తరిమికొట్టాలని, వీటి బారినపడే వారిని నిరోధించాలి, అందుకే డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలు వద్దు అని అన్నారు. ఆరోగ్యం, జీవితం ముద్దు అనే లక్ష్యంతో యువత ముందుకు సాగాలని గనిశెట్టి పిలుపునిచ్చారు. డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలను వ్యతిరేకించే ప్రతి సంఘం, సంస్థ, సమాజాభివృద్ధి కాముకులు ఈ క్యాంపెయిన్ లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మత్తు పదార్థాల గురికాకుండా కౌన్సిలింగ్ కేంద్రాల ఏర్పాటు చేయాలని గంజాయి మత్తు పదార్థాల వ్యాపారస్తుల పై ఉక్కు పాదం మోపాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, సిఐటియు నాయకులు వెంకట అప్పారావు, ఆర్ నాయుడు, నరేష్, తరుణ్, సూర్య, దిలీప్, సత్తిబాబు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# నూరు శాతం ఫలితాలతో గ్రామానికి గర్వకారణం

- కృష్ణమాచారి శిక్షణతో విజయం సాధించిన విద్యార్థులు
- విద్యార్థులను అభినందించిన గ్రామస్తులు





**పెన్ సత్తా, మార్చి 25:** ఏన్కూరు మండలం తూతక లింగన్నపేట గ్రామానికి చెందిన విద్యార్థులు గురుకుల విద్యాలయాల ఐదో తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచారు. టి.ఎల్.పేట అంబేద్కర్ నగర్ ప్రాథమిక పాఠశాలకు చెందిన మొత్తం 11 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, అందరూ ఉత్తీర్ణులై నూరు శాతం ఫలితాన్ని సాధించారు.

ఉత్తీర్ణులైన విద్యార్థులు ఏన్కూరు, వైరా బాలికల గురుకులం, వైరా బాలుర గురుకులం, అన్నపురెడ్డిపల్లి గురుకుల విద్యాలయాలలో సీట్లు సాధించారు. ఈ విద్యార్థులు టి.ఎల్.పేట గ్రామానికి చెందిన జుజ్జూరి కృష్ణమాచారి వద్ద శిక్షణ పొందారు.

ఇటీవలి సంవత్సరాల్లో ఈ గ్రామానికి చెందిన విద్యార్థులు గురుకుల ప్రవేశ పరీక్షల్లో అధిక శాతం ఫలితాలు సాధిస్తూ జిల్లాలో మంచి గుర్తింపు తెచ్చుకుంటున్నారు. గత ఏడాది బాలికల విభాగంలో జిల్లా ప్రథమ స్థానం సాధించడం గ్రామానికి గర్వకారణంగా నిలిచింది.

సీట్లు సాధించిన విద్యార్థులను ట్యూషన్ మాస్టర్ జుజ్జూరి కృష్ణమాచారి (సీనియర్ రిపోర్టర్)ను గ్రామస్తులు అభినందించారు.

# ఎన్టీపీసీలో సిఈఏ నిబంధనల పై అవగాహన కల్పించేందుకు సమావేశం







**విశాఖపట్నం, పెన్ సత్తా, మార్చి 25:**విశాఖపట్నంలో ఎన్టీపీసీ సహకారంతో ప్రాంతీయ స్థాయి ఒక-రోజు కార్యశాలను

దక్షిణ ప్రాంతం లోని విద్యుత్ రంగ భాగస్వాములకు సిఈఏ నిబంధనల పై అవగాహన కల్పించేందుకు సమావేశం

నిర్వహించారు. బుధవారం భారత ప్రభుత్వ విద్యుత్ మంత్రిత్వ శాఖకు చెందిన కేంద్ర విద్యుత్ ప్రాధికార సంస్థ (సిఈఏ), ఎన్టీపీసీ లిమిటెడ్ సహకారంతో విశాఖపట్నంలో సిఈఏ నిబంధనలు, సాంకేతిక ప్రమాణాల పై ఒక ప్రాంతీయ సదస్సు కార్యశాలను నిర్వహించింది.

ఈ కార్యశాలలో రాష్ట్ర విద్యుత్ సంస్థలు, అలాగే ఎన్టీపీసీ, ఏపీఈపిడిసిఎల్, పవర్ గ్రిడ్ , టిజీజేన్కో వంటి ప్రైవేటు రంగ విద్యుత్ సంస్థల నుండి సుమారు 100 మంది సీనియర్ అధికారులు, నిపుణులు, ప్రతినిధులు, ఇతర భాగస్వాములు పాల్గొన్నారు.

సిఈఏ ఛైర్‌పర్సన్, భారత ప్రభుత్వ (గోల్) ఎక్స్-అఫిషియో కార్యదర్శి ఘనశ్యామ్ ప్రసాద్, సిఈఏ సభ్యులు (థర్మల్), సభ్యులు (ఈ&సి), భారత ప్రభుత్వ ఎక్స్-అఫిషియో అదనపు కార్యదర్శి ప్రవీణ్ గుప్తా (వీడియో కాన్ఫరెన్స్ ద్వారా), ఎస్ఆర్పిసి సభ్య కార్యదర్శి అసిత్ సింగ్ ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథులుగా హాజరైయ్యారు. హాజరైన ప్రముఖులలో బిద్య నంద్ ఝా (ఈడి- సిఓఎస్) ; ఏస్కే సిన్హా (సీఈఓ ఎన్టిఈసిఎల్ వల్లూరు); సీకే సమంత (హోప్ -రామగుండం & తెలంగాణ); ఎస్ మధు (హోప్ - ఎన్టీపీసీ కుడ్గి); వనజ చుందూరు (డైరెక్టర్-ప్రాజెక్టులు, ఏపీఈపిడిసిఎల్); ఎల్.కే.ఎస్. రాథోడ్ (ముఖ్య ఇంజనీర్-నియంత్రణ వ్యవహారాలు, సిఈఏ); ఏ జెనా (హోప్ ఎన్టీపీసీ సింహాద్రి); పిఆర్ జెనా (జీఎం కమర్షియల్ ) ఉన్నారు. ఈ సదస్సును నిర్వహించే అవకాశాన్ని కల్పించినందుకు ఎన్టీపీసీ సింహాద్రి హోప్ ఏ జెనా, సిఈఏ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన ప్రముఖులకు, పాల్గొన్నవారికి స్వాగతం పలికి, ఈ సమావేశం పరస్పర చర్చలతో కూడిన (ఇంటరాక్టివ్) సెషన్‌గా సాగాలని ఆకాంక్షించారు. సిఈఏ ఛైర్‌పర్సన్, భారత ప్రభుత్వ ఎక్స్-అఫిషియో కార్యదర్శి ఘనశ్యామ్ ప్రసాద్ పాల్గొన్నవారికి స్వాగతం పలికారు. భారతీయ విద్యుత్ గ్రిడ్‌లో భద్రత, విశ్వసనీయత, సామర్థ్యాన్ని నిర్ధారించడమే సిఈఏ నిబంధనల ప్రధాన లక్ష్యం కాబట్టి, ఈ నిబంధనల పై తమ అవగాహనను పెంపొందించు కోవడానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పాల్గొన్నవారికి సూచించారు. పాల్గొన్న వారి నుండి వచ్చిన సానుకూల స్పందన ఈ రంగం అభివృద్ధికి సహాయ పడుతుందని ఆయన నొక్కి చెప్పారు.

ప్రాజెక్టుల అమలులో, అలాగే విద్యుత్ రంగం యొక్క సులభ మైన గ్రిడ్ నిర్వహణలో సిఈఏ నిబంధనల పాత్ర గురించి ఎస్ఆర్పిసి సభ్య కార్యదర్శి అసిత్ సింగ్ తెలియజేశారు. ఉత్పత్తి నుండి పంపిణీ స్థాయి వరకు గ్రిడ్ యొక్క ప్రస్తుత పరిస్థితులలో సిఈఏ నిబంధనల ఆవశ్యకతను ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (సిఓఎస్) బిద్యా నంద్ ఝా నొక్కి చెప్పారు. సిఈఏ నిబంధనలకు పరిచయం అనే అంశం పై ప్రదర్శన ద్వారా, గ్రిడ్ భద్రత, విశ్వసనీయత, పునరుత్పాదక ఇంధన ఏకీకరణను నిర్ధారించడానికి సిఈఏ ప్రమాణాలను చురుకుగా అమలు చేయవలసిన అవసరాన్ని సిఈఏ చీఫ్ ఇంజనీర్ (రెగ్యులేటరీ అఫైర్స్) ఎల్.కె.ఎస్. రాథోర్ హైలైట్ చేశారు. సాంకేతిక సమావేశాలలో భద్రత, విద్యుత్ సరఫరాకు సంబంధించిన చర్యలు ఉన్నాయి.

నిబంధనలు, 2023 (అరవింద్ కుమార్ మీనా, ఉప సంచాలకులు, సిఈఏ); మీటర్ల ఏర్పాటు & నిర్వహణ నిబంధనలు, 2006 గణాంక ప్రమాణాలు, 2007 (శరద్ చంద్ర భూపేష్, ఉప సంచాలకులు, సిఈఏ); గ్రిడ్ అనుసంధానానికి సంబంధించిన సాంకేతిక ప్రమాణాలు 2007, గ్రిడ్ ప్రమాణాలు 2010, వికేంద్రీకృత విద్యుత్ ఉత్పత్తి వనరుల అనుసంధానం, 2013 ( కొత్తపల్లి సతీష్ కుమార్, ఉప సంచాలకులు, సిఈఏ); థర్మల్ విద్యుత్ కేంద్రాలు, తేలియాడే సౌర విద్యుత్ (ఫ్లోటింగ్ సోలార్) రంగాలలో ఉత్తమ విధానాలు (ఎన్టీపీసీ సింహాద్రి), విద్యుత్ రంగంలో సైబర్ భద్రతా మార్గదర్శకాలు ( ఎల్.కే.ఎస్. రాథోడ్, సిఈ(రా), సిఈఏ). చివరలో జరిగిన ప్రశ్నలు-సమాధానాలు మరియు అభిప్రాయ సేకరణ సమావేశం, సాంకేతిక ప్రమాణాలు, నిర్వహణ నైపుణ్యం పట్ల ఉన్న నిబద్ధతను మరింత బలపరిచింది. సిఈఏ, ఎన్టీపీసీ సింహాద్రి బృందాలు ఈ కార్యక్రమాన్ని అత్యంత సమర్థవంతంగా నిర్వహించి, విద్యుత్ రంగం అంతటా నియంత్రణ నిబంధనల పై అవగాహనను పెంపొందించాయి.

ఈ సదస్సును విజయవంతంగా నిర్వహించినందుకు ఎన్టీపీసీ కి కృతజ్ఞతలు తెలియజేస్తూ, సిఈఏ ఉప సంచాలకులు శరద్ చంద్ర భూపేష్ వందన సమర్పణ చేయడంతో ఈ కార్యశాల ముగిసింది.

# ముదిగొండ పోలీసులు స్పీడ్ తో కుటుంబం చెంతకు సిల్వరాజు...

- సెల్వరాజును పట్టుకున్న ముదిగొండ పోలీస్ బృందం...
- సిఐ వడ్డేపల్లి మురళీ ఆధ్వర్యంలో గంటల వ్యవధిలోని సిల్వరాజ్ ఆచూకీ, పట్టివేత...
- సీఐ మురళీని అభినందిస్తున్న జిల్లా పోలీస్ శాఖ, మండల ప్రజలు...



**చింతకాని పెన్ సత్తా, మార్చి 25: ప్రతినిధి.**మండల పరిధిలోని పండ్రేగుపల్లి గ్రామానికి చెందిన మాజీ బీఆర్ఎస్ పార్టీ కార్యదర్శి, గ్రామ మాజీ సర్పంచ్ పాము సిల్వరాజు బుధవారం ఉదయం వాకింగ్ వెళ్లగా గుర్తుతెలియని వ్యక్తులు కారు ఎక్కించుకొని కిడ్నాప్ చేసినట్లు సమాచారం అందటంతో రంగంలో దిగిన సిఐ వడ్డేపల్లి మురళీ వ్యూహాత్మకమైన చర్యలు చేపట్టి తన పోలీస్ బృందంతో గంటల వ్యవధిలోని ఆచూకీ తెలుసుకొని వెంటనే పట్టుకోవడంతో మండల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఉదయం నుండి మండల వ్యాప్తంగా సిల్వరాజు కిడ్నాప్ కలకాలంపై అనేక అపోహాలు వచ్చిన సిఐ మురళీ వ్యవహరించిన తీరు భేష్. సిల్వరాజు కిడ్నాప్ నుండి ప్రతి విషయాన్ని అణువణువుగా పరిశీలన చేసి తమకున్న అతి తక్కువ విలువైన సమయాన్ని ఎంతో వ్యూహాత్మకంగా అలోచన చేసి సిల్వరాజును కుటుంబ సభ్యుల చెంతకు చేరవేయడంతో అనేకమంది ప్రశంసలను పొందారు. మండల వ్యాప్తంగా సిఐ వడ్డేపల్లి మురళీపై మండల ప్రజలందరూ నీరాజనాలు పలుకుతున్నారు.

# ఉత్సవాల ఏర్పాట్లలో వేగం పెంచాలి.

**జిల్లా కలెక్టర్ అంకిత్**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ పెన్ సత్తా, మార్చి 25:**భద్రాచలం లో ఈ నెల 27న నిర్వహించనున్న శ్రీరామనవమి, 28న మహా పట్టాభిషేకం ఉత్సవాల ఏర్పాట్లను మంగళవారం జిల్లా కలెక్టర్ అంకిత్ భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్టతో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, ఉత్సవాలకు సమయం తక్కువగా ఉన్నందున అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లలో వేగం పెంచాలని ఆదేశించారు. ముఖ్య మంత్రి పర్యటన దృష్ట్యా భద్రతా ఏర్పాట్లు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, రవాణా వంటి మౌలిక సదుపాయాలు ఎటువంటి లోపాలు లేకుండా సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఆలయ అభివృద్ధి పనులకు సంబంధించిన భూమి పూజ, శిలాఫలకం ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. పనులలో ఆలస్యం జరగకుండా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

మిథిలా స్టేడియంలో ఏర్పాటు చేస్తున్న గ్యాలరీలు, వేదికలు, భక్తులకు కూర్చునే సదుపాయాలు, ప్రవేశనిష్క్రమణ మార్గాలను కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని పార్కింగ్, వైద్య సదుపాయాలు, అంబులెన్సులు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.

ఉత్సవాల సమయంలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, తాగునీటి సరఫరా నిరంతరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా సిద్ధంగా ఉంచాలని సూచించారు.

అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తేనే ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించగలమని, ప్రతి అధికారి బాధ్యతతో విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ పరిశీలనలో శిక్షణ కలెక్టర్ సౌరబ్ శర్మ, దేవస్థానం ఈవో దామోదర్ రావు, తాసిల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు, పంచాయతీ ఈవో,వివిధ శాఖల అధికారులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

# చింతకాని మండలంలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం .




**చింతకాని పెన్ సత్తా, మార్చి 25:.**చింతకాని మండలంలో మాదకద్రవ్యాల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా పలు గ్రామాల్లో డ్రగ్స్ అవేర్‌నెస్ కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. చింతకాని గాంధీనగర్ కాలనీ, రామకృష్ణాపురం, నాగులవంచ గ్రామాలలో ఈ కార్యక్రమం చేపట్టారు. హైదరాబాద్ నుండి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈగల్ టీం ఈ కార్యక్రమంలో పాల్గొంది. ఈగల్ టీంకు చెందిన డీఎస్పీ సైదులు సారు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైర సీఐ గారు, ఖమ్మం ఎక్సైజ్ ఎస్సై రేష్మ గారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అనుసరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, గ్రామ సర్పంచులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఫిలిప్స్ వన్ చెఫ్ విడుదల



భారతీయ గృహాలకు పాకశాస్త్ర అవకాశాల ప్రపంచాన్ని ఆవిష్కరిస్తూ, రోజువారీ వంటను సులభతరం చేయడానికి రూపొందించిన వినూత్నమైన ఆల్-ఇన్-వన్ స్మార్ట్ కుకింగ్ ఉపకరణం అయిన ఫిలిప్స్ వన్ చెఫ్ ను విడుదల చేస్తున్నట్టు ఫిలిప్స్ హోమ్ అప్లయన్సెస్ వెల్లడించింది. ముంబైలో, రణ్ వీర్ బ్రార్ పర్యవేక్షణలో జరిగిన ఒక అనుభవపూర్వకమైన చెఫ్స్ టేస్టింగ్ టేబుల్ కార్యక్రమంలో ఈ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో అతిథులను లైవ్ టేస్టింగ్స్, ఇంటరాక్టివ్ ఫుడ్ స్టేషన్ల ద్వారా భారతదేశంలోని విభిన్న వంట రుచులను అన్వేషించడానికి ఆహ్వానించారు. ఈసందర్భంగా గుల్బహర్ తౌరానీ మాట్లాడుతూ? వెర్సుని వద్ద భారతీయ కుటుంబాలు వాస్తవానికి ఎలా వంట చేస్తాయో అర్థం చేసుకోవడం, వారి రోజువారీ వంటలలో సహజంగా ఇమిడిపోయే ఉపకరణాలను రూపొందించడంపైనే తమ లక్ష్యం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. భారతీయ వంటకాలు చాలా వైవిధ్యమైనవి, తరచుగా ఎక్కువ సమయం తీసుకుంటాయన్నారు. అందుకే రుచిలో రాజీపడకుండా వంట ప్రక్రియలను సులభతరం చేసే పరిష్కారాలు రోజురోజుకూ ప్రాముఖ్యతను సంతరించుకుంటున్నా యన్నారు. భారతీయ వంటకాలు ఎంతో వైవిధ్యభరితంగా, విభిన్నంగా ఉంటాయన్నారు. రుచి పరంగా ఎలాంటి రాజీపడకుండా వాటిని మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావడంలో సాంకేతికత కీలక పాత్ర పోషించగలదన్నారు. ఆ సమతుల్యతను తీసుకురావడానికే వన్ చెఫ్ రూపొందించబడింది. ఇది ఇళ్లలో వంటి చేసే వారికి అనేక రకాల వంటకాలను మరింత సులభంగా, ఆత్మవిశ్వాసంతో అన్వేషించడంలో సహాయపడుతుందని చెఫ్ రణ్ వీర్ బ్రార్ అన్నారు.

# దేశ జీడీపీ డౌన్!..
# ఈసారి 5.9 శాతానికే పరిమితం




ఈ ఏడాదికిగాను దేశ జీడీపీ వృద్ధి అంచనాలను అమెరికా బహుళజాతి ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్, అంతర్జాతీయ ఆర్థిక సేవల దిగ్గజం గోల్డ్‌మన్ సాచ్స్ మరోసారి తగ్గించింది. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధంతో పశ్చిమాసియా భగ్గుమంటున్న విషయం తెలిసిందే. గల్ఫ్ దేశాల్లో ముడి చమురు, ఎల్‌పీజీ, ఎల్ఎన్‌జీ ఉత్పత్తికి బ్రేకులుపడ్డాయి. భారత ఇంధన అవసరాల్లో దాదాపు 90 శాతం దిగుమతుల ద్వారానే తీరుతుండగా.. మిడిల్ ఈస్ట్ నుంచి పెద్ద ఎత్తునే వస్తున్నది. ఈ నేపథ్యంలో ఈసారి దేశ ఆర్థిక వృద్ధిరేటు 5.9 శాతాన్ని మించి ఉండబోదని గోల్డ్‌మన్ సాచ్స్ తాజాగా అభిప్రాయపడింది. 2026లో దేశ జీడీపీ వృద్ధి 7 శాతంగా ఉండొచ్చని గతంలో గోల్డ్‌మన్ సాచ్స్ అంచనా వేసింది. అయితే ఈ నెల 13న దీన్ని 6.5 శాతానికి తగ్గించింది. ఇప్పుడు 5.9 శాతానికి కుదించింది. కేవలం 11 రోజుల్లోనే అర శాతానికి (60 బేసిస్ పాయింట్లు) పైగా కోత పెట్టడం గమనార్హం. దీని వెనుక మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలే కారణంగా ప్రధానంగా కనిపిస్తున్నాయి. గత నెల 28 నుంచి ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ వైమానిక దాడులను ప్రారంభించాయి. అప్పట్నుంచి గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. అమెరికాకు మద్దతిస్తున్నారని పొరుగు దేశాలైన కువైట్, ఖతార్, యూఏఈ, సౌదీ అరేబియా, బహ్రెయిన్, ఇరాక్‌లపై ఇరాన్ దాడులు చేస్తున్నది. ఆయా దేశాల్లోని చమురు, గ్యాస్ క్షేత్రాలనే లక్ష్యంగా చేసుకుని క్షిపణులు, డ్రోన్లను ప్రయోగిస్తున్నది. దీంతో క్రూడాయిల్, సహజ వాయువు ఉత్పత్తి నిలిచిపోయింది. పైగా మిడిల్ ఈస్ట్ నుంచి భారత్, చైనా సహా ఇతర దేశాలకు జరిగే రవాణాలో కీలకమైన హార్ముజ్ జలసంధిని కూడా ఇరాన్ మూసేసింది. ఈ పరిణామం ఒక్కసారిగా గ్లోబల్ మార్కెట్‌లో ముడి చమురు, గ్యాస్ ధరల పెరుగుదలకు దారితీసింది. ఈ నేపథ్యంలో దేశీయ మార్కెట్‌లో ఆయా పెట్రో ఉత్పత్తుల ధరలూ పెరిగాయి. గ్యాస్ కొరత కూడా కనిపిస్తుండగా, దేశవ్యాప్తంగా చాలా హోటళ్లు, ఇతర గ్యాస్ ఆధారిత వ్యాపారాలు, పరిశ్రమలు మూతబడుతున్నదీ చూస్తూనే ఉన్నాం. ఎరువుల తయారీ కుంటుబడి వ్యవసాయ రంగం సైతం ప్రభావితం అవుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇక రవాణా రంగంపైనా భారం పడుతుండగా.. పెరిగిన పెట్రోల్, డీజిల్ రేట్లతో ఆయా వస్తూత్పత్తులన్నింటి ధరలూ ఎగబాకి ద్రవ్యోల్బణం విజృంభిస్తున్నది. ఇది మరింత ముదిరితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రాబోయే ద్రవ్య సమీక్షల్లో కఠిన ద్రవ్య విధానాన్ని అనుసరించే అవకాశాలు లేకపోలేదు. దీంతో వడ్డీరేట్లు పెరుగడం ఖాయమనే మెజారిటీ విశ్లేషకులు అంటున్నారు. అదే జరిగితే రుణ లభ్యత క్షీణించి అన్ని రంగాల్లో కార్యకలాపాలు మందగిస్తాయి. మొత్తంగా దేశ ఆర్థిక వ్యవస్థ ప్రభావితమవుతుందని గోల్డ్‌మన్ సాచ్స్ చెప్తున్నది.

# ఇరాన్ నుంచి 5 మిలియన్ బ్యారెళ్ల చమురు కొన్న రిలయన్స్




ప్రపంచంలోనే అతిపెద్ద రిఫైనరీ కాంప్లెక్స్‌ను నిర్వహిస్తున్న రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇరాన్ నుండి సుమారు 50 లక్షల బ్యారెళ్ల ముడి చమురును కొనుగోలు చేసింది. 2019లో అమెరికా ఆంక్షల కారణంగా ఇరాన్ నుండి చమురు దిగుమతులను భారత్ నిలిపివేసింది. అయితే ప్రస్తుతం పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తత పరిస్థితుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా చమురు కొరత ఏర్పడింది. ఈ సంక్షోభాన్ని నివారించడానికి, అంతర్జాతీయ మార్కెట్‌లో పెరుగుతున్న ధరలను అదుపు చేయడానికి అమెరికా ప్రభుత్వం ఇరాన్‌పై ఉన్న ఆంక్షలను 30 రోజులపాటు తాత్కాలికంగా సడలించింది. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకున్న రిలయన్స్, నేషనల్ ఇరానియన్ ఆయిల్ కంపెనీ(ఐఓసీ)తో ఈ భారీ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ఆర్థికంగానూ, సాంకేతికంగానూ రిలయన్స్‌కు ఎంతో లాభదాయకం. ఇరాన్ ముడి చమురు నాణ్యత జామ్‌నగర్ రిఫైనరీలోని అత్యాధునిక యంత్రాలకు అత్యంత అనుకూలంగా ఉంటుంది. దీనివల్ల తక్కువ ఖర్చుతో ఎక్కువ ఇంధనాన్ని ఉత్పత్తి చేసే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 110 నుండి 120 డాలర్ల మధ్య ఉండగా, రిలయన్స్ సుమారు 7 డాలర్ల ప్రీమియంతో ఈ డీల్ కుదుర్చుకున్నట్లు సమాచారం. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం తర్వాత రష్యా చమురుపై భారత్ ఏ విధంగా ఆధారపడిందో, ఇప్పుడు ఇరాన్ చమురు దిగుమతుల పునఃప్రారంభం ద్వారా భారత్ తన ఇంధన వనరులను వివిధ దేశాల నుంచి దిగుమతులు చేసుకోవాలని నిర్ణయించినట్టు సమాచారం. ఇది కేవలం రిలయన్స్‌కే కాకుండా, దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరల స్థిరీకరణకు కూడా పరోక్షంగా దోహదపడే అవకాశం ఉంది.

## ఎసి ధరలకు పశ్చిమాసియా సెగ..!




పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధాల వల్ల ఎసి ధరలు పెరిగే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. సరఫరా తగ్గడం, ముడి సరుకుల ధరలు పెరగడంతో వచ్చే కొద్ది రోజుల్లోనే వినియోగదారులపై భారం పడొచ్చని భావిస్తున్నారు. ప్రముఖ ఎసి ఉత్పత్తుల కంపెనీ బ్లూ స్టార్ నివాస, వాణిజ్య కూలింగ్ విభాగాలలో తన ఉనికిని మరింత బలోపేతం చేసుకోనున్నట్లు మంగళవారం ప్రకటించింది. హైదరాబాద్‌లో బ్లూస్టార్ వైస్ ప్రెసిడెంట్ మార్కెటింగ్ గిరీష్ హింగోరని, ఆ గ్రూప్ ప్రెసిడెంట్ మోహిత్ సుద్ ఆ కంపెనీ ప్రీమియం శ్రేణీ ఐకోనియా ఉత్పత్తులను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ.. కంపెనీ పోర్ట్‌ఫోలియోలో ఇప్పుడు 125 రకాల రూమ్ ఎయిర్ కండీషనర్ మోడళ్లు ఉన్నాయన్నారు. ఇందులో వినియోగదారుల అవసరాలకు, వివిధ రకాల వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రూపొందించిన ఫ్లాగ్‌షిప్ ప్రీమియం శ్రేణి ఐకోనియా కూడా ఉందన్నారు. ప్రస్తుతం 1.4 కోట్ల యూనిట్లుగా ఉన్న ఎసి మార్కెట్.. 2030 నాటికి 3 కోట్ల యూనిట్లకు విస్తరిస్తుందని అంచనా వేశారు. ఎసి పరిశ్రమ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ధరలు 7 నుంచి 8 శాతం వరకు పెరగనున్నట్లు గిరీష్, మోహిత్ సుద్ తెలిపారు. ప్రధానంగా రాగి అల్యూమినియం, స్టీల్ వంటి ముడిసరుకుల ధరలు పెరగడం వల్ల ఉత్పత్తి వ్యయం దాదాపు 8.5 శాతం అధికమైందన్నారు.. దీనికి తోడు కొత్త ఇంధన సామర్థ్య నిబంధనల ప్రకారం తయారీలో మార్పులు చేయాల్సి రావడంతో మరో 4 శాతం అదనపు భారం పడిందన్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం వల్ల ప్లాస్టిక్ విడిభాగాలకు అవసరమైన ఆయిల్, ఎల్ఎన్‌జి లభ్యత తగ్గడం కూడా ఈ సంక్షోభానికి ప్రధాన కారణమన్నారు. ఈ భారాన్ని అప్పుడే వినియోగదారులపై మోపే అవకాశాలు లేవన్నారు.

## చమురు 150 డాలర్లకు చేరితే.. మాంద్యంలోకి ప్రపంచం..!



చమురు ధరలు 150 డాలర్లకు చేరితే ప్రపంచం ఆర్థిక మాంద్యంలోకి వెళ్తుందని అమెరికా అసెట్ మేనేజ్‌మెంట్ దిగ్గజం బ్లాక్‌రాక్ సీఈవో లారీ ఫింక్ హెచ్చరించారు. ఇరాన్ ముప్పు కొనసాగి.. చమురు ధరలు పెరిగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్ర పర్యవసానాలు ఎదుర్కొంటుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ మేరకు అంతర్జాతీయ మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. పశ్చిమాసియాలో ప్రస్తుత ఘర్షణలు చివరకు ఎలాంటి ఫలితాన్ని ఇస్తాయనే దానిపై ఇప్పుడే ఒక అంచనాకు రావడం తొందరపాటే అవుతుందని ఫింక్ అన్నారు. "ఘర్షణలు ముగిసి, ఎలాంటి ఆంక్షలు లేకుండా ఇరాన్ (ఎతీజీని)ను ప్రపంచం ఆమోదిస్తే.. చమురు ధరలు యుద్ధం ముందు నాటికంటే దిగువకు పడిపోతాయి. అలాకాకుండా వార్ కొనసాగి, ఆ ధరలు 100 డాలర్లకు పైగా.. 150 డాలర్లకు చేరువగా సుదీర్ఘకాలం ఉంటే.. ప్రపంచ ఆర్థికవ్యవస్థపై పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయి. ప్రపంచం ఆర్థిక మాంద్యంలోకి జారుకోవచ్చు" అని అంచనా వేశారు.

## షాకిచ్చిన బంగారం, వెండి ధరలు



గత వారం రోజులుగా బంగారం ధరలు వరుసగా పతనమవుతూ, కొనుగోలుదారులలో ఆశలు రేకెత్తించాయి. 10 గ్రాముల బంగారం ధర రూ.లక్షకు పడిపోతుందని అందరూ ఎదురుచూస్తున్న తరుణంలో, బుధవారం ఉదయం ఊహించని పరిణామం చోటుచేసుకుంది. ఉదయం 10 గంటలకు హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధరపై ఏకంగా రూ.3760 పెరిగి రూ.1,46,670కి చేరింది. అలాగే 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.3450 పెరిగి రూ.1,34,450కి ఎగబాకింది. నేడు బంగారం కొనుగోలు చేసేవారికి ఇది అదనపు భారమనే చెప్పాలి. వెండి కూడా బంగారం బాటలోనే పయనించింది. కిలో వెండిపై రూ.10,000 పెరగ్గా.. నేటి ధర రూ.2,60,000 గా ఉంది. ప్రపంచ బులియన్ మార్కెట్లో బంగారం ధరలు ఆకస్మికంగా పెరగడం, డాలర్ బలహీనపడటమే దీనికి ప్రధాన కారణాలుగా నిపుణులు పేర్కొంటున్నారు. అమెరికాలో ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్లపై వస్తున్న తాజా వార్తలు పెట్టుబడిదారులను బంగారం వైపు మళ్లించాయి. దీనికి తోడు దేశీయంగా వివాహాల సీజన్ కారణంగా డిమాండ్ పెరగడం, రూపాయి మారకం విలువలో మార్పులు కూడా ఈ పెరుగుదలకు కారణాలుగా కనిపిస్తున్నాయని నిపుణులు చెప్తున్నారు. బంగారం, వెండి ధరల పెరుగుదల తాత్కాలికమేనా లేక రాబోయే రోజుల్లో కూడా కొనసాగుతుందా అనేది వేచి చూడాలి.

RNI:APTEL/2023/87729
పెన్ సత్తా
PEN SATTA Telugu Daily

# ఎడిటోరియల్

## ఇరాన్‌పై కొనసాగుతున్న దాడులు

ఇరాన్‌పై ఏకపక్ష దాడులకు దిగిన అమెరికా తాత్కాలికంగా వెనక్కు తగ్గిందా? వెనక్కు తగ్గినట్టు ట్రంప్ గేమ్ ఆడుతున్నాడా పోరును ఆపేందుకు ట్రంప్ దారులు వెతుకుతున్నాడా? దానిలో భాగంగానే ఇరాన్‌లో ఇంధన వ్యవస్థలపై ఐదు రోజుల పాటు దాడులు నిలిపివేస్తున్నట్లు ప్రకటించాడా! అవన్నీ ఒట్టి మాటలే అని టెహ్రాన్ ఎందుకన్నది! ఇరాన్‌పై దాడులు 25వ రోజులో ప్రవేశించిన మంగళవారం నాడు ఇది రాస్తున్న సమయానికి ఉన్న సందేహాలు ఇవి. ఒక్కటి మాత్రం వాస్తవం. ఇరాన్‌పై దాడులను అమెరికా–ఇజ్రాయిల్ కూటమి ఇంకెన్ని రోజులో కొనసాగించే అవకాశాలు లేవన్నది అత్యధిక విశ్లేషకుల అభిప్రాయం. దాడులు దీర్ఘకాలం కొనసాగితే అమెరికన్లలో వ్యతిరేకత మరింత పెరుగుతుందని, నవంబరులో జరిగే పార్లమెంటు మధ్యంతర ఎన్నికల్లో ఓడిపోతే పదవీ కాలం పూర్తయ్యే వరకు ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందనే భయంతో ట్రంప్ వెనకడుగు వేసేందుకు నిర్ణయించుకొని దారి వెతుక్కుంటున్నట్లు చెబుతున్నారు. దీనికి విరుద్ధంగా జరుగుతుందా? ఏమో! ఐదు రోజుల విరామం ప్రకటన చేసిన తరువాత కూడా సోమవారం రాత్రి, మంగళవారం నాడు దాడులు ఆగలేదు. అమెరికా బలహీనతలు, దాని ఎత్తుగడల వైఫల్యం గురించి పెద్ద ఎత్తున సాగుతున్న చర్చతో వెనక్కు తగ్గే అవకాశాలు ఉన్నాయనే విశ్లేషణలు వెలువడుతున్న సమయంలో ట్రంప్ 48 గంటల బెదిరింపు ప్రకటన చేశాడు. హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరవకపోతే ఇరాన్ విద్యుత్ మౌలిక సదుపాయాలను ధ్వంసం చేస్తామని ప్రకటించాడు. అయితే ఆ గడువు ముగిసిన వెంటనే ఐదు రోజుల పాటు దాడులను వాయిదా వేస్తామంటూ నాటకీయంగా సోమవారం సాయంత్రం ప్రకటించాడు. తమపై దాడులకు మరింత మంది సైనికులను కూడ గట్టుకొనేందుకే ఈ ప్రకటన చేశాడని ఇరాన్ స్పందించింది. తమ విద్యుత్ సంస్థలపై దాడులు జరిపితే తలెత్తే పర్యవసానాలకు భయపడి ట్రంప్ ఆ ప్రకటన చేశాడని ఇరాన్ జాతీయ టీవీ, ఇతర మీడియా సంస్థలు పేర్కొన్నాయి. రెండు దేశాల మధ్య చర్చల గురించి ఎవరేం చెప్పినప్పటికీ తెర వెనుక సంప్రదింపులు జరుగుతున్నట్లు ఊహాగానాలు వెలువడ్డాయి. ఇరాన్‌పై దాడులకు ట్రంప్‌ను ఎవరు ప్రేరేపించారనే అంశంపై రకరకాల వార్తలు వచ్చాయి. అయితే సోమవారం నాడు ట్రంప్ టెన్నెసీలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో చేసిన వ్యాఖ్యలు రక్షణ మంత్రి పీట్ హెగ్‌సేత్‌పై నెపం మోపాయి. తన పక్కనే ఉన్న హెగ్‌సేత్‌తో ట్రంప్ మాట్లాడుతూ "వారు అణ్వాయుధాలను కలిగి ఉండకూడదంటే మనం వారిని వదల కూడదని నువ్వే కదా మొదట చెప్పింది" అన్నాడు. అంతా అధ్యక్షుడి చేతుల్లోనే ఉందన్నాడు తప్ప పీట్ ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. ఇతరులపై నెపం మోపటంలో ట్రంప్ ఘనుడు. ఇరాన్ చమురు క్షేత్రాలపై ఇజ్రాయిల్ జరిపిన దాడుల గురించి తనకు తెలియదని కొద్ది రోజుల క్రితం చెప్పాడు. ఇరాన్ ప్రతిఘటన ఇలా ఉంటుందని తనకెవరూ చెప్పలేదన్నాడు. ఇప్పుడు మరొక కొత్త కథ చెప్పాడు. రేపు ఇంకెన్ని చెబుతాడో చూద్దాం.

ఫిబ్రవరి 28న ప్రారంభమైన దాడులు ఎప్పుడు ముగుస్తాయో తెలియదు. ఇప్పటి వరకు ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయిల్ దాదాపు రెండు వేల దాడులు జరిపినట్లు అంచనా. ఆపరేషన్ ఎపిక్ ఫురీ పేరుతో అమెరికా, రోరింగ్ లయన్ పేరుతో ఇజ్రాయిల్ తెగబడుతున్నాయి. వందకు పైగా విమానాలను దాడులకు వినియోగించినట్లు చెబుతున్నారు. అత్యధిక దాడులు రాజధాని టెహ్రాన్ నగరం మీదే జరిగాయి. ఈ దాడులతో భారీగా నష్టపోయినప్పటికీ ఇరాన్ ఎందుకు వెనక్కు తగ్గటం లేదన్నది యావత్ ప్రపంచంలో చర్చగా ఉందంటే అతిశయోక్తి కాదు. సుప్రీమ్ నేత అయాతుల్లా అలీ ఖమేని, ఇతర అనేక మంది ప్రముఖులను పోగొట్టుకున్నప్పటికీ ధైర్యం కోల్పోలేదు. అమెరికా మీద గెలవటం అన్నది కల అని తెలిసినప్పటికీ ప్రతిఘటన దాడులు జరుపుతున్నది. ముందుగా దాడులు నిలిపివేయాలని, తమకు నష్టపరిహారం చెల్లించాలని, తమపై ఉన్న ఆంక్షలను ఎత్తివేయాలని, భవిష్యత్‌లో ఎలాంటి దాడులు జరపబోమనే హామీ కావాలని అమెరికాకే షరతులు పెట్టింది. తాను బలహీనంగా ఉన్నపుడు ఎదుటి వాడి బలహీనతల మీద దెబ్బకొట్టాలన్నది ఒక సూత్రం. ఇప్పుడు అదే జరిగింది. హోర్ముజ్ జలసంధిని దిగ్బంధనం చేయటంతో ఆ మార్గంలో చమురు, గ్యాస్ ఎగుమ తి, దిగుమతి చేసుకొన దేశాలు ప్రభావితమై అమెరికా మీద వత్తిడి తెస్తాయన్నది ఒకటైతే అమెరికా మిలిటరీ స్థావరాలను అనుమతించిన గల్ఫ్ దేశాల మీద దాడులు చేస్తే అవి కూడా వాషింగ్టన్ మీద ప్రభావం చూపుతాయన్నది ఇరాన్ అంచనా, అదే జరిగింది. నిజానికి ఈ విషయాలన్నీ ముందే చెప్పినా ఎవరూ ఖాతరు చేయలేదు. చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకున్నట్లు ఇప్పుడు కతార్, ఒమన్ తెర వెనుక కాల్పుల విరమణ యత్నాలు ప్రారంభించాయి. అయితే తొందరేం లేదు ముందు మాపై దాడులను నిలిపివేయనివ్వండి. అర్ధవంతమైన ప్రతిపాదనలతో రానివ్వండి అన్నట్లు ఇరాన్ తాపీగా ఉంది. ఎలాంటి చర్చలకూ సంసిద్ధత వెల్లడించలేదు. యుద్ధం మీద అమెరికా అదుపు కోల్పోతున్నదంటూ సోమవారం నాడు అమెరికా ప్రధాన మీడియాలో తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. ఉభయపక్షాలూ ఎవరూ ఎవరిని నమ్మే స్థితి లేనందున చర్చలు అనుమానమే. ఒకవేళ తామే విజయం సాధించినట్లు అమెరికా ప్రకటిస్తే హోర్ముజ్ జలసంధి మీద ఇరాన్ ఆధిపత్యం నిర్ధారణ అవుతుంది. దాని అణు కార్యక్రమం కూడా కొనసాగుతుంది. రానున్న రోజుల్లో మరిన్ని దాడులు జరిపితే గల్ఫ్ దేశాల మీద ఇరాన్ దాడులు కొనసాగుతాయి. ఇరాన్ చమురు కేంద్రం ఖార్గ్ దీవి మీద దాడులకు దిగితే పరిస్థితి మరింతగా దిగజారుతుంది. మెరైన్ దళాలతో ఈ దీవిని చేరుకుంటే పెద్ద సంఖ్యలో అమెరికన్లను బందీలుగా ఇరాన్‌కు అప్పగించటమే అని రాజీనామా చేసిన ఉన్నతాధికారి కెంట్ హెచ్చరించాడు. అందువలన ఏకపక్షంగా దాడులను విరమించటమే అమెరికా ముందున్న మార్గం అని చెప్పవచ్చు. అయితే సామ్రాజ్యవాదం తన ఓటమిని అంత తేలికగా అంగీకరిస్తుందా? ఒకవైపు ఐదు రోజుల విరామం ప్రకటించిన ట్రంప్ మరోవైపు అదనపు దళాలను సమీకరిస్తున్నాడు. జపాన్‌లో ఉన్న సైనిక స్థావరం నుంచి రెండువేల మంది మెరైన్ (సముద్రం, భూమి మీదా దాడులు చేసే శిక్షణ పొందినవారు) దళాన్ని మధ్య ప్రాచ్యానికి తరలించారు. అమెరికాలోని కాలిఫోర్నియా నుంచి మరో రెండున్నర వేల మందిని తరలిస్తున్నారు. ఏప్రిల్ నాటికి ఇతర మరికొన్ని దళాలను కూడా తరలించేందుకు నిర్ణయించారు. అమెరికా దూకుడు వైఖరిలో వచ్చిన మార్పుతో ఊహాగానాలు ఊపందుకున్నాయి. పాకిస్తాన్ కేంద్రంగా వాషింగ్టన్–టెహ్రాన్ చర్చలు ఈ వారంలో జరగవచ్చని రాయిటర్స్ పేర్కొన్నది. ఉభయ పక్షాలను దగ్గరకు చేర్చేందుకు ఈజిప్టు, టర్కీ తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నాయి. పాక్ సైన్యాధికారి మునీర్ రెండు దేశాల అధ్యక్షులతో ఈపాటికే సంప్రదింపులు జరిపినట్లు వార్తలు. ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ గాలీబ్‌తో ట్రంప్ అల్లుడు కుషనర్, రాయబారి స్టీవ్ విట్‌కాఫ్ సంప్రదింపులు జరిపినట్లు ఇజ్రాయిల్ మీడియా పేర్కొన్నది. ట్రంప్ చర్యలకు నిరసనగా రాజీనామా చేసిన అమెరికా ఉగ్రవాద వ్యతిరేక సంస్థ మాజీ అధిపతి జో కెంట్ ఐదు రోజుల ట్రంప్ విరామ ప్రకటన గురించి స్పందించాడు. ముందుగా ఇజ్రాయిల్‌ను అదుపు చేస్తే తప్ప సంప్రదింపులు ముందుకు వెళ్లవని, అవి కొనసాగితే అమెరికా సంప్రదింపుల సామర్థ్యం బలహీనపడుతుందని చెప్పాడు. ఇజ్రాయిల్ గూఢచార సంస్థలు ఇచ్చిన తప్పుడు సమాచారం అమెరికాను యుద్ధంలోకి లాగిందని, అమెరికా విదేశాంగ విధానంపై ప్రభావం చూపిందన్నది కెంట్ అభిప్రాయం. యావత్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచిన ఇరాన్ మరొక చర్య ఏమంటే గల్ఫ్ దేశాల్లో ఉన్న డేటా (సమాచార) కేంద్రాలపై దాడులు. ఈ కేంద్రాలు అమెరికా, ఇజ్రాయిల్ చేపట్టిన కృత్రిమ మేథ లక్ష్యాలను నెరవేర్చకుండా చేసేందుకు ఇరాన్ కేంద్రీకరించింది. అయితే అమెరికా కూడా టెహ్రాన్‌లో ఉన్న కేంద్రాల మీద దాడులు చేసింది. ఇప్పటి వరకు రెండు వైపులా ఐదు కేంద్రాలు దెబ్బతిన్నట్లు చెబుతున్నారు. ఇరవై తొమ్మిది సాంకేతిక కేంద్రాలపై దాడులు చేస్తామని ఇరాన్ ప్రకటించింది. సాంప్రదాయ యుద్ధంలో వంతెనలు, విమానాశ్రయాలు, నౌకా కేంద్రాల మీద కేంద్రీకరించటం తెలిసిందే. ఇప్పుడు యుద్ధంలో డేటా కేంద్రాలను కూడా వినియోగిస్తున్నందున వాటిని కూడా వదలటం లేదు. గల్ఫ్ దేశాలు వివాదాలకు దూరంగా ఉంటాయంటూ అమెరికా, ఇతర అనేక దేశాలు అక్కడ పెట్టుబడులు పెట్టాయి. తాజా పరిణామాలతో అవి ఆర్థికంగా నష్టపోవటమేగాక గల్ఫ్ దేశాల మీద ఉన్న నమ్మకం కూడా సడలటం ఖాయం. ఇరాన్‌కు వీటిని దెబ్బ తీయాలనే ఆలోచన కలగటానికి అమెరికా, ఐరోపా దేశాలు చూపిన మార్గమే. రష్యాను దెబ్బ తీసేందుకు ఈ దేశాలు ఉక్రెయిన్‌కు డేటా కేంద్రాల ద్వారా కీలకమైన రష్యా కేంద్రాల గురించి సమాచారం ఇవ్వటమేగాక ఉక్రెయిన్ దాడులను సమన్వయపరచటం, ఎప్పటికప్పుడు మాప్‌లను అందించటం వంటి సేవలను అందించాయి. నీవు నేర్పిన విద్యయే నీరజాక్షా అన్నట్లు ఇరాన్‌కు అవసరమైన సలహాలు, సమాచారాన్ని రష్యా అందిస్తున్నదని ఎవరైనా వాపోతే చేసేదేమీ లేదు!

# నిమిషాల్లోనే సూపర్ ఫుడ్.. ఒక్క కప్పు తింటే చాలు..



**హైదరాబాద్ పెన్ పవర్:** జొన్న అంబలి, జొన్న పిండితో తయారుచేసే ఓ పాతకాలపు ఆరోగ్యకరమైన వంటకం. ఇది శరీరానికి అవసరమైన మంచి బ్యాక్టీరియాను అందించి రోగనిరోధక శక్తిని పెంచుతుంది. సులభంగా తయారుచేసే ఈ అంబలి బరువు తగ్గాలనుకునే వారికి, అలాగే అన్ని వయస్సుల వారికీ అల్పాహారంగా లేదా రాత్రి భోజనంగా అనువైనది. కడుపుకు చలువ చేసి, జీర్ణశక్తిని మెరుగుపరుస్తుంది. జొన్న జావ పోషకాల గని.. ఇది శరీరానికి శక్తిని, ఆరోగ్యాన్ని అందిస్తుంది. అందుకే.. జొన్న జావ ప్రతిరోజూ తాగాలని సూచిస్తున్నారు ఆరోగ్య నిపుణులు.. తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనాలు పొందవచ్చని పేర్కొంటున్నారు. వాస్తవానికి జొన్నల్లో ఇందులో ఫైబర్, ప్రోటీన్, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం, విటమిన్ ః3 (నియాసిన్) వంటి ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అందుకే.. ఈ సంప్రదాయ పానీయం.. జొన్న జావను శతాబ్దాలుగా వినియోగిస్తున్నారు. ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే ఈ జావను తీసుకోవడం వల్ల ఎన్నో సమస్యలు దూరమవుతాయని పేర్కొంటున్నారు. జొన్న జావ.. బరువు తగ్గడానికి, డయాబెటిస్ నియంత్రణకు, ఎముకల బలానికి, జీర్ణక్రియను మెరుగుపరచడానికి సహాయపడే ఒక సూపర్ ఫుడ్.. అని ప్రతిరోజూ తప్పనిసరిగా తీసుకోవాలని సూచిస్తున్నారు ఆరోగ్య నిపుణులు.. జొన్నపిండి, నీరు ? మజ్జిగతో సులభంగా 5 నిమిషాల్లో తయారుచేసుకునే ఈ జావ, వేసవిలో ఒంటికి చలవ చేసి శక్తినిస్తుంది.

వాస్తవానికి జొన్న జావ లేదా జొన్న అంబలి అనేది జొన్న పిండితో తయారుచేసే ఒక పాతకాలపు, ఆరోగ్యకరమైన వంటకం. ఇది శరీరానికి అవసరమైన మంచి బ్యాక్టీరియాను పుష్కలంగా అందిస్తుంది. అల్పాహారంగా లేదా రాత్రి భోజనంగా ఏ వయసు వారైనా దీనిని తీసుకోవచ్చు. క్రమం తప్పకుండా జొన్న అంబలిని తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి, ముఖ్యంగా బరువు తగ్గాలనుకునే వారికి ఇది ఎంతో ఉపయోగపడుతుంది.

జొన్న జావ తయారీ విధానం:ముందుగా, స్టవ్ మీద ఒక గిన్నె పెట్టి ఐదు కప్పుల నీటిని పోసి మరిగించాలి. ఈలోపు, మరొక గిన్నెలో ఒక కప్పు జొన్న పిండిని తీసుకుని, ఒక కప్పు నీటిని కలిపి ఉండలు లేకుండా బాగా కలుపాలి. తర్వాత ఇంకొక కప్పు నీటిని కలిపి పిండిని కొద్దిగా పల్చగా చేయాలి. పిండి ఉండ కట్టకుండా ఉండటానికి ఈ విధంగా నీటితో కలపడం ముఖ్యం. నీళ్లు బాగా మరిగిన తర్వాత, ఫ్లేమ్‌ను తగ్గించి, కలిపి పెట్టుకున్న జొన్న పిండి మిశ్రమాన్ని నెమ్మదిగా పోస్తూ గరిటెతో నిరంతరం కలుపుతూ ఉండాలి. అడుగున అంటుకోకుండా ఉండటానికి మధ్యమధ్యలో కలుపుతూ, ఐదు నిమిషాల పాటు చిక్కబడే వరకు ఉడికించాలి. రవ్వతో అంబలి చేసేటట్లయితే, ఒక గ్లాసు రవ్వకు ఆరు గ్లాసుల నీళ్లు పోసి, రవ్వ మెత్తగా ఉడికే వరకు సమయం ఎక్కువ తీసుకోవాల్సి ఉంటుంది. అంబలి ఉడికిన తర్వాత స్టవ్ ఆపివేసి, రెండు నిమిషాల పాటు కలుపుతూ పక్కన పెట్టాలి. దీనికి ఉల్లిపాయ, మజ్జిగను యాడ్ చేసుకోని తాగవచ్చు..

పులియబెట్టే ప్రక్రియ:ఉడికించిన జావను శుభ్రమైన మట్టికుండలో పోసి, మూత పెట్టి ఆరు నుండి ఏడు గంటలు లేదా రాత్రంతా పులియనివ్వాలి. మట్టికుండలో పులియబెట్టడం వల్ల మంచి బ్యాక్టీరియా మరింత సమృద్ధిగా అభివృద్ధి చెందుతుంది. రాత్రంతా పులియబెట్టిన తర్వాత, ఉదయం జావ గట్టిగా జున్నులా తయారవుతుంది. దీనిని గరిటెతో ఉండలు లేకుండా బాగా కలిపి మెత్తగా చేసుకోవాలి. మెత్తగా చేసుకున్న జావలో అర లీటరు మజ్జిగను సగం సగం పోస్తూ బాగా కలుపాలి. ఇంకా పల్చగా కావాలంటే ఎక్కువ మజ్జిగ కలుపుకోవచ్చు. మధ్యమధ్యలో ఉండలు ఉంటే, పెరుగు చిలికే దానితో బీట్ చేసుకోవచ్చు. చివరగా, రుచికి సరిపడా చాలా కొద్దిగా ఉప్పును కలిపి బాగా కలుపాలి. అంతే, పోషక విలువలు నిండిన జొన్న అంబలి సిద్ధం. రాత్రంతా పులియబెట్టడం వల్ల జొన్న అంబలిలో ప్రొబయోటిక్స్ (మంచి బ్యాక్టీరియా) అధికంగా అభివృద్ధి చెందుతాయి. ఇవి శరీర రోగనిరోధక శక్తిని పెంచడానికి, జీర్ణవ్యవస్థను మెరుగుపరచడానికి సహాయపడతాయి. చెడు బ్యాక్టీరియాతో పోరాడటానికి శరీరాన్ని బలంగా ఉంచుతాయి. బరువు తగ్గాలనుకునే వారికి ఇది మంచి అల్పాహారం లేదా రాత్రి భోజనం. వేసవిలో శరీరంలోని వేడిని తగ్గించి, కడుపులో చల్లగా, హాయిగా ఉండేలా చేస్తుంది. సన్నగా తరిగిన ఉల్లిపాయ, కరివేపాకు, కొత్తిమీర కలిపి తీసుకోవడం వల్ల రుచి మరింత పెరుగుతుంది.

# 13 గంటల ఉపవాసంతో ఇన్సులిన్ మ్యాజిక్!



**హైదరాబాద్ పెన్ పవర్:** చాలామంది రాత్రి 10 లేదా 11 గంటలకు భోజనం చేసి వెంటనే పడుకుంటారు. దీనివల్ల శరీరంలోని సహజ జీవ గడియారం దెబ్బతింటుంది. నిద్రపోయే సమయంలో శరీరం విశ్రాంతి తీసుకోవాలి, కానీ ఆలస్యంగా తినడం వల్ల జీర్ణక్రియ కొనసాగి రక్తపోటు పెరుగుతుంది. నిద్రకు కనీసం మూడు గంటల ముందే భోజనం ముగించడం వల్ల అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని పరిశోధకులు గుర్తించారు.ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో సరైన సమయానికి ఆహారం తీసుకోకపోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా రక్తపోటు, మధుమేహం వంటివి ప్రతి ఇంట్లోనూ సాధారణమైపోయాయి. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ గణాంకాల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా వందల కోట్ల మంది ఈ సమస్యలతో పోరాడుతున్నారు. అయితే, మనం తినే ఆహారంలో మార్పులు చేయకుండానే, కేవలం 'తినే సమయాన్ని' మార్చడం ద్వారా ఈ రెండింటినీ నియంత్రించవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పరిశోధనలో తేలిన నిజాలు.. నార్త్ వెస్టర్న్ యూనివర్సిటీ పరిశోధకులు 36 నుండి 75 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారిపై ఈ అధ్యయనం చేశారు. వీరికి నిద్రకు మూడు గంటల ముందే భోజనం ముగించి, రాత్రిపూట 13 నుండి 16 గంటల పాటు ఉపవాసం ఉండాలని సూచించారు. దీనివల్ల వారిలో ఆశ్చర్యకరమైన మార్పులు కనిపించాయి. రాత్రి సమయంలో వీరి రక్తపోటు సుమారు 3.5% మేర తగ్గింది. హార్ట్ రేట్ 5% వరకు తగ్గి, గుండె పనితీరు మెరుగుపడింది. రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులోకి రావడమే కాకుండా, ఇన్సులిన్ సెన్సిటివిటీ పెరిగింది. ఇది డయాబెటిస్ రోగులకు ఎంతో మేలు చేస్తుంది. మీరు రాత్రి 10 గంటలకు నిద్రపోతారనుకుంటే, రాత్రి 7 గంటల లోపే భోజనం పూర్తి చేయాలి. భోజనం తర్వాత లైట్ల వెలుతురు తగ్గించి, మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండటం వల్ల మెటబాలిజం మెరుగుపడుతుంది. రాత్రిపూట పప్పు, పనీర్, సలాడ్ లేదా గ్రిల్ చేసిన చికెన్ వంటి తేలికపాటి ఆహారం తీసుకోవడం ఉత్తమం. రాత్రిపూట ఎక్కువ సేపు ఉపవాసం ఉండటం వల్ల శరీరంలో కార్టిసాల్ అనే హార్మోన్ తగ్గి, మెటబాలిజం సమతుల్యం అవుతుంది. షిఫ్ట్ డ్యూటీలు చేసే వారికి ఇది కొంచెం కష్టమైనా, సాధారణ వ్యక్తులు ఈ చిన్న అలవాటును మార్చుకోవడం ద్వారా గుండె జబ్బుల ముప్పు నుండి తప్పించుకోవచ్చు. వీకెండ్స్‌లో కూడా ఇదే నిద్ర సమయాన్ని పాటించడం వల్ల ఫలితాలు మెరుగ్గా ఉంటాయని నిపుణులు తెలియజేస్తున్నారు. మనం ఏమి తింటున్నాం అనే దానికంటే, 'ఎప్పుడు తింటున్నాం' అనేది మన ఆరోగ్యాన్ని నిర్ణయిస్తుంది. నిద్రకు మూడు గంటల ముందు భోజనం ముగించడం అనే చిన్న మార్పుతో మీ రక్తపోటు, చక్కెర స్థాయిలను సహజంగానే నియంత్రించుకోవచ్చు.

# ఆందోళనతో అల్లాడిపోతున్నారా?



**హైదరాబాద్ పెన్ పవర్:** యాంగ్జైటీ అనేది ఒక సాధారణ మానసిక స్థితి అయినప్పటికీ, దానిని నిర్లక్ష్యం చేస్తే అది తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. మన ఆలోచనలు మన నియంత్రణలో ఉన్నప్పుడే జీవితం ఆనందంగా ఉంటుంది. నేటి యాంత్రిక జీవనశైలిలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక సమయంలో మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. ఆఫీసు పనులు, కుటుంబ బాధ్యతలు, ఆర్థిక ఇబ్బందులు.. ఇలా కారణం ఏదైనా కావచ్చు, మనసులో నిరంతరం ఆందోళన గూడు కట్టుకుంటోంది. ఈ ఆందోళన కేవలం మనసుకే పరిమితం కాకుండా, నిద్రలేమి, అధిక రక్తపోటు వంటి శారీరక సమస్యలకు కూడా దారితీస్తోంది.అయితే, మందుల కంటే ముందు మన జీవనశైలిలో చేసుకునే చిన్న చిన్న మార్పులతో ఈ యాంగ్జైటీని సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని నిపుణులు చెబుతున్నారు. ప్రశాంతమైన మనసు కోసం మీరు పాటించాల్సిన ఆ అద్భుతమైన చిట్కాలు ఇవే!శ్వాసపై ధ్యాస : మీకు ఎప్పుడైనా విపరీతమైన ఆందోళనగా అనిపించినప్పుడు, వెంటనే మీ శ్వాస వేగం పెరుగుతుంది. అప్పుడు 'డీప్ బ్రీతింగ్' అద్భుతంగా పనిచేస్తుంది. ముక్కు ద్వారా గాలిని పీల్చి, నాలుగు సెకన్ల పాటు ఆపి, ఆపై నెమ్మదిగా వదలాలి. ఇలా 5 నిమిషాలు చేస్తే మెదడుకు ఆక్సిజన్ అంది వెంటనే రిలాక్స్ అవుతారు. వ్యాయామం : శారీరక శ్రమకు, మానసిక ఆరోగ్యానికి దగ్గరి సంబంధం ఉంది. రోజుకు కనీసం 20 నిమిషాల నడక లేదా యోగా చేయడం వల్ల శరీరంలో 'ఎండార్ఫిన్లు' అనే హార్మోన్లు విడుదలవుతాయి. ఇవి ఒత్తిడిని తగ్గించి మనసును ఉల్లాసంగా ఉంచుతాయి.కెఫిన్, చక్కెరపై నియంత్రణ : మనం తీసుకునే ఆహారం మన మూడ్‌ని ప్రభావితం చేస్తుంది. అతిగా కాఫీ, టీలు తాగడం వల్ల అందులోని కెఫిన్ మనల్ని మరింత ఉద్రేకానికి గురి చేస్తుంది. అలాగే ఎక్కువ చక్కెర ఉన్న పదార్థాలు రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను అకస్మాత్తుగా పెంచి, తగ్గించడం వల్ల యాంగ్జైటీ పెరుగుతుంది. వీటిని పరిమితం చేయడం శ్రేయస్కరం.డిజిటల్ డిటాక్స్ : నిద్రలేమి ఆందోళనకు ప్రధాన శత్రువు. రాత్రి పడుకునే గంట ముందు మొబైల్ ఫోన్ పక్కన పెట్టేయండి. స్క్రీన్ నుండి వచ్చే బ్లూ లైట్ నిద్రను దూరం చేస్తుంది. రోజుకు 7–8 గంటల గాఢ నిద్ర మీ మనసును రీఛార్జ్ చేస్తుంది.అభిరుచులకు ప్రాణం పోయండి : మీకు ఇష్టమైన పనిలో నిమగ్నమవ్వడం కంటే గొప్ప మందు

మరొకటి లేదు. పుస్తక పఠనం, గార్డెనింగ్ లేదా సంగీతం వినడం వంటి హాబీలు మనసును నెగటివ్ ఆలోచనల నుండి మళ్ళిస్తాయి. ఒత్తిడి ఎక్కువగా ఉన్నప్పుడు సన్నిహితులు లేదా కుటుంబ సభ్యులతో మనసు విప్పి మాట్లాడటం వల్ల భారం తగ్గుతుంది. జీవితంలో సమస్యలు రావడం సహజం, కానీ వాటిని మనం ఎలా స్వీకరిస్తామనేదే ముఖ్యం. పైన పేర్కొన్న చిన్న చిన్న అలవాట్లను మీ దైనందిన జీవితంలో భాగం చేసుకుంటే, ఆందోళనను జయించి సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చు. ఒకవేళ సమస్య మరీ తీవ్రంగా ఉంటే నిపుణుల సలహా తీసుకోవడానికి వెనుకాడకండి.

# అక్కడ ఆడాలంటే.. ఇక్కడ చెలరేగాలి



2024 టీ20 ప్రపంచకప్ తర్వాత పొట్టి ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పేసిన స్టార్ ఆటగాళ్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ.. నిరుడు టెస్టుల నుంచి కూడా తప్పుకొన్నారు. ఆ ఇద్దరూ వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్నారు. గత ఏడాది ఒక దశలో పరిస్థితి చూస్తే.. వీళ్లు మొత్తంగా అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పేస్తారేమో అనిపించింది. కోచ్ గంభీర్ కూడా వాళ్లిద్దరినీ సాగనంపే ఆలోచనలో ఉన్నాడనే చర్చ జరిగింది. కానీ కోహ్లి, రోహిత్ ఈ ఫార్మాట్లో నిలకడగా రాణించడం ద్వారా ఆ అవకాశం లేకుండా చూసుకున్నారు. కానీ వన్డే ప్రపంచకప్‌నకు ఇంకా ఏడాదికి పైనే సమయం ఉన్న నేపథ్యంలో వీరి స్థానాలకు గ్యారెంటీ ఉందని భావించలేం. ఇంకో ఏడాది పాటు ఫిట్‌నెస్, ఫామ్‌ను చాటుకుంటూ ఉంటేనే ప్రపంచకప్‌పై ఆశలు ఉంటాయి.

ఐపీఎల్‌లో అందరూ ఈ ఇద్దరి ఆటను నిశితంగా గమనిస్తారు. కాబట్టి ఇక్కడ సత్తా చాటడం ఎంతో ముఖ్యం. గత ఏడాది కోహ్లి ఐపీఎల్‌లో గొప్పగా రాణించి ఆర్సీబీ కప్పు నెగ్గడంలో కీలక పాత్ర పోషించాడు. చివరగా ఆడిన అంతర్జాతీయ మ్యాచ్‌ల్లోనూ అతను చెలరేగాడు. మరి సూపర్ ఫామ్‌ను లీగ్‌లోనూ కొనసాగిస్తాడా.. తనపై అభిమానుల్లో ఎప్పుడూ ఉండే భారీ అంచనాలను అందుకుంటాడా అన్నది ఆసక్తికరం. ఇక రోహిత్ గత కొన్నేళ్లుగా ఐపీఎల్‌లో కొంచెం ఒడుదొడుకులు ఎదుర్కొంటున్నాడు. రెండేళ్ల కిందట ముంబయి కెప్టెన్సీ కూడా చేజారింది. నిరుడు సీజన్ ఆరంభంలో తడబడ్డ రోహిత్.. తర్వాత పుంజుకుని మెరుగైన ప్రదర్శన చేశాడు. వన్డే ప్రపంచకప్ లక్ష్యంగా రోహిత్ బరువు తగ్గి, ఫిట్‌గా కనిపిస్తున్నాడు. వన్డేల్లో తన ఆట కూడా బాగానే ఉంది. అయినప్పటికీ ముంబయి జట్టులో కొంత ఒత్తిడిని ఎదుర్కొంటున్న రోహిత్.. ఐపీఎల్‌లో ఎలా రాణిస్తాడో చూడాలి.

**గూడు మారింది.. మరి ఆట?:** రవీంద్ర జడేజా పేరు క్రికెట్ ప్రపంచానికి తెలిసింది అతను రాజస్థాన్ రాయల్స్ జట్టులో ఉన్నప్పుడే. తన కెరీర్ మొదలైంది, స్టార్ అయింది రాయల్స్ ఆటగాడిగానే. ఇక్కడ మెరుపులు మెరిపించే టీమ్‌ఇండియాలో చోటు సంపాదించాడు. స్టార్ ఆల్‌రౌండర్‌గా ఎదిగాడు. ఎన్నో ఏళ్ల పాటు వివిధ ఫార్మాట్లలో భారత జట్టుకు ఆల్‌రౌండ్ సేవలు అందిస్తున్న జడేజా.. ఇప్పుడు కెరీర్ చరమాంకంలో ఉన్నాడు. టీ20లకు గుడ్‌బై చెప్పేసి టెస్టులు, వన్డేల్లో మాత్రమే అతను కొనసాగుతుండగా.. ఇటీవల తన ఫామ్ ఏమంత గొప్పగా లేదు. అంతర్జాతీయ క్రికెట్లో నిరాశపరుస్తున్న జడ్డూ.. ఐపీఎల్‌లో కూడా కొన్ని సీజన్ల నుంచి స్థాయికి తగ్గ ప్రదర్శన చేయట్లేదు.

ఈ నేపథ్యంలో చెన్నై సూపర్‌కింగ్స్‌తో సుదీర్ఘ బంధానికి తెరపడింది. మళ్లీ తన పాత జట్టయిన రాయల్స్‌కు ఆడబోతున్నాడు జడేజా. తన స్పిన్‌లో మర్మాన్ని బ్యాటర్లు సులువుగా కనిపెట్టేసి చెలరేగిపోతున్న నేపథ్యంలో అతను తన బౌలింగ్‌కు పదును పెట్టాల్సిందే. బ్యాటింగ్‌లో మాత్రం జడేజా నిలకడగానే రాణిస్తున్నాడు. కానీ తన నుంచి జట్టు ఆశించేది బౌలింగ్ మెరుపులే. కాబట్టి దాన్ని మెరుగుపరుచుకుని ఐపీఎల్‌లో తన ప్రత్యేకతను చాటుకోకుంటే.. వన్డే ప్రపంచకప్ జట్టులో చోటు మీద ఆశలు వదులుకోవాల్సిందే.

**షమికి సాధ్యమేనా?:** దాదాపు పదేళ్ల పాటు టీమ్‌ఇండియాలో ప్రధాన పేసర్లలో ఒకడిగా ఉన్నాడు మహ్మద్ షమి. మూడు ఫార్మాట్లలోనూ నిలకడగా రాణిస్తూ జట్టుకు ఎన్నో విజయాలు అందించాడీ బెంగాల్ పేసర్. 2023 వన్డే ప్రపంచకప్‌లో అతనెంత గొప్పగా రాణించాడో అభిమానులకు గుర్తుండే ఉంటుంది. కానీ ఆ టోర్నీ తర్వాత అతడు ఎక్కువగా టీమ్‌ఇండియా జెర్సీలో కనిపించలేదు. ఫిట్‌నెస్ సమస్యలతో ఏడాది పాటు ఆటకు దూరంగా ఉన్న షమి.. పునరాగమనంలో అనుకున్నంతగా రాణించలేకపోయాడు. ఆ తర్వాత అతడి ఫిట్‌నెస్, ఫామ్ మెరుగుపడ్డా.. దేశవాళీల్లో నిలకడగా రాణించినా.. సెలక్టర్లు అవకాశం ఇవ్వలేదు.

అయితే అందరి దృష్టి నిలిచి ఉండే ఐపీఎల్‌లో రాణిస్తే.. షమిని టీమ్‌ఇండియాలోకి ఎంపిక చేయక తప్పని పరిస్థితి వస్తుంది. టెస్టులతో పాటు వన్డేల్లోనూ అతను రేసులోకి వస్తాడు. నిరుడు సన్‌రైజర్స్ తరఫున షమి రాణించలేకపోయాడు. ఈసారి లఖ్‌నవూ అతణ్ని తీసుకుంది. దేశవాళీ ఫామ్‌ను కొనసాగిస్తూ.. ఐపీఎల్‌లో షమి నిలకడగా రాణించాడంటే మళ్లీ వన్డే జట్టులోకి రావడమే కాక.. ప్రపంచకప్ ఛాన్స్ కూడా అందుకుంటాడు.

## వయస్సే పెరిగింది.. పస తగ్గలేదు.. మైదానంలో ధోనీ సిక్సర్ల వర్షం!



ఐపీఎల్ 2026 ప్రారంభానికి మరో మూడు రోజులే సమయం ఉండటంతో క్రికెట్ సందడి ఆకాశాన్న అంటుతోంది. ముఖ్యంగా చెన్నై సూపర్ కింగ్స్ అభిమానుల్లో ధోనీ ఫిట్‌నెస్, సంజూ శాంసన్ రాకపై భారీ అంచనాలు నెలకొన్నాయి. సీఎస్కే తమ తొలో మ్యాచ్ ని గువహటి వేదికగా రాజస్థాన్ రాయల్స్‌తో ఆడనుంది. ప్రస్తుతం ఈ చెన్నై ప్రాక్టీస్ సెషన్లలో మునిగిపోయింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఒక వీడియోలో ఎంఎస్ ధోనీ ముఖేష్ చౌదరి బౌలింగ్‌లో భారీ సిక్సర్ బాదడం కనిపిస్తోంది. ఇది చూసి వింటేజ్ ధోనీ ఫామ్‌లోనే ఉన్నాడని ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు. 2023లో ఐదోసారి సీఎస్కేకు టైటిల్ అందించిన తర్వాత మహేంద్ర సింగ్ ధోనీ మోకాలికి సర్జరీ చేయించుకున్న సంగతి తెలిసిందే. అయితే, ఆ సమస్య అతడిని ఇంకా వేధిస్తూనే ఉంది. ఈ సీజన్‌లో ధోనీ ఎన్ని మ్యాచ్‌లు ఆడతారనే దానిపై ఇంకా సందిగ్ధత కొనసాగుతున్నప్పటికీ, నెట్స్‌లో అతడి బ్యాటింగ్ చూస్తుంటే అభిమానుల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. కాగా రవీంద్ర జడేజా, సామ్ కరన్‌లను వదులుకుని ట్రేడింగ్ ద్వారా సంజూ శాంసన్‌ను సీఎస్కే తమ జట్టులోకి తెచ్చుకుంది. ఒకవేళ ఎంఎస్ ధోనీ ఫిట్‌నెస్ కారణంగా వికెట్ కీపింగ్ చేయలేకపోతే, సంజూ శాంసన్ ప్రత్యామ్నాయంగా ఉన్నాడు. ఇటీవల జరిగిన టీ20 ప్రపంచకప్ 2026లో భారత్ టైటిల్ గెలవడంలో సంజూ కీలక పాత్ర పోషించారు. క్వార్టర్ ఫైనల్లో వెస్టిండీస్‌పై 97 నాటౌట్, సెమీస్‌లో ఇంగ్లండ్‌పై 89, ఫైనల్లో న్యూజిలాండ్‌పై 89 పరుగులు చేసి భీకరమైన ఫామ్‌లో కనిపిస్తున్నాడు. మరోవైపు, రుతురాజ్ గైక్వాడ్ నేతృత్వంలోని సీఎస్కే లీడర్‌షిప్ గ్రూప్‌లో సంజూ అనుభవం జట్టుకు అదనపు బలాన్ని ఇవ్వనుంది.

**సీఎస్కే మ్యాచులు:**

**మార్చి 30: చెన్నై సూపర్ కింగ్స్ వర్సెస్ రాజస్థాన్ రాయల్స్ (గౌహతి)**
**ఏప్రిల్ 3: చెన్నై సూపర్ కింగ్స్ వర్సెస్ పంజాబ్ కింగ్స్ (చెన్నై)**
**ఏప్రిల్ 5: చెన్నై సూపర్ కింగ్స్ వర్సెస్ ఆర్సీబీ (బెంగళూరు)**
**ఏప్రిల్ 11: చెన్నై సూపర్ కింగ్స్ వర్సెస్ ఢిల్లీ క్యాపిటల్స్ (చెన్నై)**

# షాకిస్తున్న టాప్-10 సినిమాల ఓటీటీ డీల్స్



భారతీయ చిత్ర పరిశ్రమలో అగ్ర హీరోల క్రేజ్ ఇప్పుడు కేవలం థియేటర్ల వసూళ్లకే పరిమితం కావడం లేదు. సినిమా సెట్స్ పై ఉండగానే ఓటీటీ సంస్థలు వందల కోట్లు కుమ్మరించి డిజిటల్ హక్కులను సొంతం చేసుకుంటున్నాయి. ఇప్పటికే అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం.. సౌత్ నుంచి నార్త్ వరకు అగ్ర హీరోల తదుపరి సినిమాల ఓటీటీ ఒప్పందాలు కళ్లు చెదిరే రేంజులో సాగాయి. ముఖ్యంగా పవన్ కళ్యాణ్, ప్రభాస్, ఎన్టీఆర్, షారూఖ్ వంటి స్టార్ల సినిమాలకు నెట్‌ఫ్లిక్స్, ప్రైమ్ వీడియో వంటి సంస్థలు రికార్డు స్థాయి ధరలను ఆఫర్ చేస్తున్నాయి. టాలీవుడ్ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న -ఉస్తాద్ భగత్ సింగ్- ఓటీటీ డీల్ గురించి చాలా చర్చ సాగుతోంది. ఈ సినిమా డిజిటల్ హక్కులను నెట్‌ఫ్లిక్స్ సంస్థ సుమారు రూ. 80 కోట్లకు దక్కించుకున్నట్లు సమాచారం. పవన్ కెరీర్‌లో ఇది బిగ్గెస్ట్ ఓటీటీ డీల్స్ లో ఒకటిగా నిలవడంతో మెగా అభిమానులు ఖుషీ అవుతున్నారు. మరోవైపు మెగాస్టార్ చిరంజీవి సోషియో ఫాంటసీ మూవీ -విశ్వంభర- కూడా భారీ స్థాయిలోనే ట్రేడ్ అవుతోంది. ఈ సినిమా హక్కుల కోసం జియో హాట్‌స్టార్ దాదాపు రూ. 60 నుండి 80 కోట్లు వెచ్చించనున్నట్లు అంచనా. ఇక పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ రేంజ్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఆయన నటిస్తున్న -సలార్ 2- అన్ని భాషల డిజిటల్ హక్కులను నెట్‌ఫ్లిక్స్ రూ. 162 కోట్లకు దక్కించుకుందని ప్రచారం సాగుతుండగా... సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతున్న -స్పిరిట్- మూవీకి అప్పుడే రూ. 150 కోట్ల మేర ఆఫర్ వచ్చినట్టు టాక్ వినిపిస్తోంది. ప్రభాస్- కమల్ హాసన్- నాగ్ అశ్విన్ కాంబినేషన్ భారీ మల్టీస్టారర్ సీక్వెల్ మూవీ -కల్కి 2898 ఏడి- ఓటీటీ డీల్ 150 కోట్లు పైగా పలుకుతుందని ఒక అంచనా. అలాగే ప్రశాంత్ నీల్ - ఎన్టీఆర్ కాంబినేషన్‌లో రాబోతున్న -డ్రాగన్- చిత్రానికి కూడా నెట్‌ఫ్లిక్స్ రూ. 125 కోట్లు ఆఫర్ చేసినట్లు ట్రేడ్ వర్గాల సమాచారం. షూటింగ్ ప్రారంభ దశలోనే ఉన్నా ఈ కాంబోకు ఉన్న క్రేజ్ దృష్ట్యా ఈ స్థాయి రేటు పలుకుతోంది. ప్రభాస్, ఎన్టీఆర్ సినిమాలు ఇంకా చిత్రీకరణల దశలో ఉండగా భారీ ఆఫర్లు వస్తున్నాయి. అయితే ఫైనల్ డీల్ గురించి చిత్రబృందం వెల్లడించాల్సి ఉంటుంది. టైర్-2 హీరోలలో అడివి శేష్ -గూఢచారి 2-.. నిఖిల్ -స్వయంభు- చిత్రాలు కూడా మంచి లాభాలను ఆర్జిస్తున్నాయి. అమెజాన్ ప్రైమ్ గూఢచారి సీక్వెల్ కోసం రూ. 30-40 కోట్లు కేటాయించనుందని కథనాలు రాగా, నిఖిల్ సినిమాకు రూ. 25-30 కోట్లు వెచ్చిస్తోందని సమాచారం. కన్నడ స్టార్ యష్ నటిస్తున్న -టాక్సిక్- తెలుగు డబ్బింగ్ హక్కులు ఓటీటీ హక్కులతో కలిపి నెట్‌ఫ్లిక్స్ రూ. 150 కోట్ల భారీ డీల్ కుదుర్చుకోవడం గమనార్హం.

కేవలం సౌత్ సినిమాలే కాదు.. బాలీవుడ్ నుంచి వస్తున్న పాన్ ఇండియా చిత్రాలు కూడా సరికొత్త రికార్డులను సృష్టిస్తున్నాయి. ఈ జాబితాలో అన్నిటికంటే టాప్‌లో నిలిచింది షారుఖ్ ఖాన్ నటిస్తున్న -కింగ్-. ఈ సినిమా కోసం నెట్‌ఫ్లిక్స్ ఏకంగా రూ. 250 కోట్లు వెచ్చించినట్లు వార్తలు వస్తున్నాయి. అలాగే రణబీర్ కపూర్ -రామాయణ పార్ట్ 1- హక్కులను ప్రైమ్ వీడియో రూ. 200 కోట్లకు పైగా ధరతో సొంతం చేసుకుంది. హిందీతో పాటు సౌత్ భాషల్లోనూ ఈ సినిమాలకు ఉన్న క్రేజ్ వల్లే ఈ స్థాయిలో బిజినెస్ జరుగుతోంది. పెద్ద సినిమాలు విడుదలైన 8 వారాల వరకు ఓటీటీలోకి రాకూడదనే రూల్ ఉన్నా కానీ, ఈ ఒప్పందాల విలువ తగ్గకపోవడం విశేషం. మొత్తానికి థియేట్రికల్ వసూళ్లతో సంబంధం లేకుండా.. డిజిటల్ రైట్స్ రూపంలోనే నిర్మాతలు తమ బడ్జెట్‌లో సగానికి పైగా వెనక్కి తెచ్చుకుంటున్నారు. అగ్ర హీరోల సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ప్రభావాన్ని చూపిస్తాయో తెలీదు కానీ.. ఓటీటీ ప్రపంచంలో మాత్రం ఇప్పటికే -బ్లాక్ బస్టర్- డీల్స్ కుదిరాయని చెప్పవచ్చు. ఈ భారీ ఒప్పందాలు సదరు సినిమాలపై ప్రేక్షకుల్లో మరింత ఆసక్తిని పెంచుతున్నాయి.



ఆశు రెడ్డి యొక్క అత్యంత ఆకర్షణీయ మైన మూమెంట్స్

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com